
www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి YADADRI BHUVANAGIRI | సంపుటి: 1 VOLUME : 1 | సంచిక: 276 ISSUE : 276 | మంగళవారం, 3 మార్చి, 2026 TUESDAY, MARCH 3, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు: 8 PAGES : 8 | వెల: 5-00 RS : 5-00 |
|---|---|---|---|---|---|---|


## ఈ సారి భారీ ఎండలు



2 లో..

# భీకర యుద్ధం..



- అమెరికాకు తోడుగా రంగంలోకి బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ
- ఇరాన్‌కు మద్దతుగా హెజ్బొల్లా, ఇరాకీ సాయుధ మిలీషియా
- దాడులు నాలుగైదు వారాలు కొనసాగుతాయన్న ట్రంప్
- ఇజ్రాయెల్, ఇరాక్, గల్ఫ్ దేశాల్లో ఇరాన్ క్షిపణి దాడులు
- ఆరామ్‌కో చమురు రిఫైనరీపై దాడి.. సరఫరా బంద్
- లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపైనా భీకర దాడి
- నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్ దాడి?
- ఖమేనీ భార్య, తాత్కాలిక సుప్రీం మృతి?

దుబాయ్/వాషింగ్టన్, మార్చి 2: ఇజ్రాయెల్, అమెరికా ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఇరాన్ రాజధాని టెహ్రాన్, ఇస్ఫహాన్ నగరాల్లో భీకర దాడులకు దిగాయి. ఫైటర్లు, క్షిపణులతో విరుచుకుపడ్డాయి. మొత్తంగా ఇరాన్‌లో 130 పట్టణాలపై దాడులు చేశాయి. నౌకాదళ స్థావరాలపై బాంబుల వర్షం కురిపించాయి. ఇరాన్ క్షిపణి ప్రయోగ వ్యవస్థలు, డ్రోన్ స్థావరాలపై ప్రత్యేక దృష్టిపెట్టి విధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) సోమవారం ప్రకటించింది. ఇరాన్‌కు చెందిన రెండు సుఖోయ్-24 ఫైటర్లను కూల్చేశామని ఖతార్ రక్షణ శాఖ ప్రకటించింది. మిగతా 2లో..





## జనాభా దామాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్‌లు పెంచాలి

- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ఈమేరకు తీర్మానం చేయాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- ఎస్సీ ఉప కులాల నేతలతో సమావేశం

2 లో..

# మీరు ప్రధాని కావాలి!

- దేశం కోసం ఈ ప్రతిపాదనకు ఓకే చెప్పండి..
- రాహుల్‌ని కోరిన సీఎం రేవంత్
- సానుకూలంగా స్పందించిన రాహుల్
- మోదీపై యుద్ధానికి సిద్ధమంటూ ప్రకటన
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డీసీసీ అధ్యక్షులతో సమావేశంలో ఆసక్తికర పరిణామం
- చప్పట్లతో మార్మోగిన సమావేశ మందిరం
- రేవంత్ శక్తిమంతుడంటూ రాహుల్ ప్రశంస
- బీసీ రిజర్వేషన్‌పై ప్రైవేటు బిల్లుకు సుముఖం



హైదరాబాద్, మార్చి 2(వార్త వేదిక సూర్య): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రధాని అభ్యర్థిని తానేనన్న సంకేతాన్ని లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఇచ్చారు. దేశం కోసం రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని, ప్రధాని అభ్యర్థి బాధ్యతలు తీసుకునేందుకు ఆయన అంగీకరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో సోమవారం జరిగిన డీసీసీ అధ్యక్షుల శిక్షణా కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, ఇది తాను ఒక ముఖ్యమంత్రిగా కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా కోరుతున్నానని అన్నారు. రాహుల్‌గాంధీ అంగీకరిస్తే ఆయన్ను ప్రధానిని చేసేందుకు బరాబర్ నిలిచి పోరాడతామని చెప్పారు. డీసీసీ అధ్యక్షులు ముఖ్యమంత్రితో శృతి కలిపారు. రేవంత్ ప్రతిపాదనను సానుకూలంగా తీసుకున్న రాహుల్‌గాంధీ.. మోదీపై యుద్ధానికి తాను సిద్ధమని ప్రకటించారు. తద్వారా వచ్చే ఎన్నికల్లో తానే ప్రధాని అభ్యర్థినన్న సంకేతాన్ని రాహుల్‌గాంధీ తొలిసారిగా ఇచ్చారు. రాహుల్ స్పందనతో సమావేశ మందిరం చప్పట్లతో దద్దరిల్లి పోయింది. ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షులతో రాహుల్‌గాంధీ మాటామంతీ కార్యక్రమానికి ముగింపుగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. దేశం కోసం రాహుల్‌గాంధీ ప్రధాని కావాల్సిందేనన్నారు. ఆయన కుటుంబంలో ముత్తాత నెహ్రూ, నానమ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్‌గాంధీలు ప్రధానులుగా చేశారని గుర్తు చేసుకున్నారు. కుటుంబంలో ముగ్గురు ప్రధానులుగా చేయడంతో రాహుల్‌గాంధీకి ప్రధాని పదవిపై వ్యామోహం లేదని చెప్పారు. అత్యంత సాధారణ జీవితం గడుపుతూ, అందరితో కలిసి పోతూ రాజకీయాలు నిర్వహిస్తున్నారని అన్నారు.

దేశం ప్రస్తుతం ఉన్న పరిస్థితుల నేపథ్యంలో రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యేలా ప్రతి ఒక్కరూ కష్టపడాలని రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. ''రాహుల్‌గాంధీ కూడా తాను ప్రధాని అయ్యేందుకు కృషి చేయాలి. దేశం కోసం ఆయన ఈ బాధ్యత తీసుకోవాలి. రాహుల్‌గాంధీ సంసిద్ధత వ్యక్తం చేయాలన్నది దేశ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల కోరిక'' అంటూ రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. బాధ్యత తీసుకోవడానికి తాను సిద్ధమే అన్నట్లుగా రాహుల్ నవ్వుతూ తల ఊపారు. మోదీపై యుద్ధానికి తాను సిద్ధమని ప్రకటించారు. రేవంత్‌రెడ్డి తన ప్రసంగం కొనసాగిస్తూ, గడిచిన 19 ఏళ్లలో జెడ్పీటీసీ స్థాయి నుంచి సీఎం స్థాయికి వచ్చిన తాను ప్రజాజీవితంలో ఏనాడూ పైరవీలు చేయలేదని చెప్పారు. ప్రజా సమస్యలపై గళం విప్పుతూ, పోరాటాలు చేస్తూ ఈ స్థాయికి వచ్చానని వివరించారు. పోరాటాల సందర్భంగా తనపై కేసులు పెట్టారని, పరువు నష్టం దావాలు కూడా వేశారని చెప్పుకొచ్చారు. మిగతా 2లో..


## విజయవంతంగా ముగిసిన 'సంఘటన సృజన్ అభియాన్' శిక్షణ

- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన రాహుల్ గాంధీ

2 లో..

# తమ్మినేనిపై అభిశంసన

- పార్టీ ప్రమాణాలను గాలికి వదిలేశారన్న కేంద్ర కమిటీ



హైదరాబాద్, మార్చి 2 (వార్త వేదిక సూర్య): సీపీఎం సీనియర్ నేత తమ్మినేని వీరభద్రాన్ని ఆ పార్టీ కేంద్ర కమిటీ అభిశంసించింది. ఆయన రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా ఉన్న సమయంలో తప్పుడు రాజకీయ దృక్పథాలను అనుసరించారని ఆక్షేపించింది. 2024లో జరిగిన రాష్ట్ర పార్టీ నూతన కార్యదర్శి ఎన్నిక సమయంలో ప్రజాతంత్ర చర్చ, ఏకాభిప్రాయ సాధన స్థానంలో లాబీయింగ్, ప్రలోభాలు, అస్తిత్వవాద అప్పీళ్లు చోటుచేసుకున్నాయని విమర్శించింది. పార్టీ ప్రమాణాలను గాలికి వదిలేశారని దుయ్యబట్టింది. ఆ ఎన్నికల సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ నిట్టనిలువునా చీలిందని పేర్కొంది. ''నూతన రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక ప్రక్రియలో ముఠాతత్వం ఆందోళనకర స్థాయికి చేరింది. పొలిట్‌బ్యూరో సభ్యులు ఐక్యతను నెలకొల్పడానికి తీవ్రంగా ప్రయత్నించారు. కానీ ఎన్నిసార్లు అప్పీల్ చేసినా అప్పటి రాష్ట్ర కార్యాదర్శి తమ్మినేనితో సహా పార్టీ నాయకత్వంలోని ఒకవర్గం వెనక్కి తగ్గేందుకు అంగీకరించలేదు. ఫలితంగా పార్టీ ఐక్యత నిలబెట్టేందుకు పొలిట్‌బ్యూరో సభ్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆ సమయంలో అనేక అభ్యంతరకర, అంగీకరించలేని ధోరణులు తీవ్ర రూపంలో కనిపించాయి. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించారు. రాష్ట్ర కమిటీ సమావేశంలో చాలా మంది సభ్యులు మిగతా 2లో..

## తలనొప్పిగా రాజ్యసభ ఎలక్షన్స్




- సీట్ల ఎంపికపై తెలంగాణ కాంగ్రెస్‌లో జోరుగా చర్చలు
- ఆశావహులు ఎక్కువ ఉండడంతో అదృష్టం ఎవరిని వరిస్తుందోనని ఉత్కంఠ

2 లో..



2 లో..

## రాహుల్‌గాంధీ.. రూ.1000 కోట్ల వసూలుకు వచ్చారా?: కేటీఆర్



## తుమ్మనపేటలో విరోషి దంపతుల సందడి

- డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపుగా కొత్త జంటకు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆహ్వానం

2 లో..



# బకాయిలు చెల్లించాలి

- ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల నిరాహార దీక్షలో బీజేపీ నేతల డిమాండ్
- హాజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపీలు ఈటెల, డీకే అరుణ, రఘునందన్‌రావు తదితరులు

కవాడిగూడ, మార్చి 2 (వార్త వేదిక సూర్య): రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరా పార్కు వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ దీక్షకు సంఘీభావంగా ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు, శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీలు ఈటెల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్‌రావు హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 3.6 లక్షల ప్రభుత్వ ఉద్యోగులు, 2,8 లక్షల రిటైర్డ్ ఉద్యోగుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు. మిగతా 2లో.




## రికార్డులు బ్రేక్..

- అత్యధిక గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదు
- 6,267 మెగావాట్లకు చేరిక
- రానున్న రోజుల్లో మరింత విద్యుత్ వినియోగం
- అన్ని రకాల ఏర్పాట్లు చేశాం: టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ

2 లో..

# కెనడాతో భారత్ యురేనియం డీల్

- యురేనియం సహా ఇతర కీలక ఖనిజాల సరఫరాకు కెనడా అంగీకారం
- 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 50 బిలియన్ డాలర్ల
- పౌర ఇంధన అవసరాల కోసమే..
- క్యాంపస్‌లు ఏర్పాటు చేయనున్న ఆ దేశ యూనివర్సిటీలు
- ఢిల్లీలో ఇద్దరు ప్రధానులు మోదీ, కార్నేల చర్చలు



2 లో..

# భీకర యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఇక అమెరికా, ఇజ్రా యెల్ దాడులతో ఇరాన్‌లో మృతుల సంఖ్య 555కు చేరిందని రెడ్ క్రిసెంట్ సంస్థ వెల్లడించింది. టెహ్రాన్‌లోని గాంధీ ఆస్పత్రి సహా ఇరాన్‌వ్యాప్తంగా 9 ఆస్పత్రులపై ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేశాయని ఇరాన్ పార్లమెంట్ హెల్త్ కమిటీ సభ్యురాలు ఫాతిమా బేగీ తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధం మరో తీవ్రమైన మలుపు తీసుకుంటోంది. ఇప్పటివరకు అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై విరుచుకుపడితే.. ఇరాన్ బదులుగా ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడులు చేస్తోంది. సోమవారం ఇరాన్‌కు మద్దతుగా లెబనాన్‌లోని హెజ్బొల్లా తీవ్రవాద సంస్థ, ఇరాకీ సాయుధ మిలీషియా గ్రూపులు తెరపైకి వస్తే.. మరోవైపు అమెరికా, ఇజ్రాయెల్‌కు తోడుగా ఫ్రాన్స్, యూకే, జర్మనీ రంగంలోకి వచ్చాయి. ఈ మేరకు మూడు దేశాలు సోమవారం ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశాయి. హెజ్బొల్లా ఆదివారం రాత్రి ఉన్నట్టుండి ఇజ్రాయెల్‌పైకి దాడికి దిగడంతో.. ప్రతిగా ఇజ్రాయెల్ లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. అమెరికా, ఇజ్రాయెల్‌లకు మద్దతుగా యూకే తెరపైకి రావడంతో సైప్రస్‌లోని యూకే సైనిక స్థావరంపై ఇరాన్ డ్రోన్ దాడులు చేసింది. అంతేకాదు భారీ స్థాయిలో క్షిపణి దాడులు కూడా చేస్తామని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. మరోవైపు తమ ప్రాంతాలపై దాడులు ఆపకుంటే.. తాము ఇరాన్‌పై దాడికి దిగుతామని సౌదీ, కువైట్, ఖతార్, బహ్రెయిన్ హెచ్చరించాయి.

### అమెరికాకు తోడుగా నిలుస్తాం

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితి, ఇరాన్ ప్రతిదాడులను ఎదుర్కొనేందుకు తాము అమెరికాతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు యూకే, ఫ్రాన్స్, జర్మనీ ప్రకటించాయి. ఈ మేరకు మూడు దేశాల ప్రభుత్వాధినేతలు కీర్ స్టార్మర్, ఎమ్మాన్యుయెల్ మేక్రాన్, ఫ్రెడరిక్ మెర్జ్ ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. తమ మిత్రదేశాలపై ఇరాన్ చేస్తున్న దాడులు దారుణమని.. పశ్చిమాసియా ప్రాంతంలోని తమ మిలిటరీ సిబ్బంది, పౌరులకు దీనితో ముప్పు ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో తమ దేశ,



మిత్రదేశాల ప్రయోజనాలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసే సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. అయితే నేరుగా ఇరాన్‌పై దాడికి దిగుతారా, మిత్రదేశాలకు సహాయకంగా ఉంటారా అన్న వివరాలేమీ వెల్లడించలేదు. నిజానికి ఇరాన్‌పై యుద్ధం లో అమెరికాకు తోడుగా ఉంటామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ఆదివారమే ప్రకటించారు. ఈ క్రమంలో సైప్రస్‌లోని అక్రోటిరిలో ఉన్న యూకే సైనిక స్థావరంపై ఇరాన్ డ్రోన్ దాడి చేసి, రన్‌వేను ధ్వంసం చేసింది. మరోవైపు ఫ్రాన్స్‌లోని నౌకాదళ స్థావరంపై డ్రోన్ దాడి జరిగినట్టు ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ పేర్కొన్నారు. యూఏఈ, బహ్రెయిన్‌లలోని అమెజాన్ వెబ్‌సర్వీసెస్ క్లౌడ్ డేటా సెంటర్లపై డ్రోన్ దాడులు జరిగాయి. యూఏఈ డేటా సెంటర్‌పైకి ఒక వస్తువు దూసుకొచ్చి మంటలు చెలరేగాయని, దానితో డేటా సెంటర్ పనిచేయడం లేదని అమెజాన్ సోమవారం ప్రకటించింది. దానితోపాటు బహ్రెయిన్ డేటా సెంటర్‌లోనూ సమస్యలు తలెత్తాయని తెలిపింది. దీనికి కారణమేంటో వెల్లడించలేదు.

### కూలిన మూడు అమెరికన్ ఎఫ్-15ఈ ఫైటర్లు..

సోమవారం అమెరికాకు చెందిన మూడు ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ మల్టీరోల్ ఫైటర్లు కువైట్‌లో కూలిపోయాయి. అందులో ఒక దానిని ఇరాన్ క్షిపణులతో కూల్చివేసినట్టుగా ఆ దేశ మీడియాలో వార్తలు వచ్చాయి. ఒక ఫైటర్ గింగిరాలు తిరుగుతూ నేలకూలుతున్న వీడియోలను ప్రసారం చేశాయి. అయితే కువైట్ గగనతల రక్షణ వ్యవస్థలు ఆ విమానాలను పొరపాటున శత్రుదేశానికి చెందినవిగా భావించి కూల్చివేశాయని అనంతరం కువైట్ ప్రభుత్వం, అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించాయి. ఆ ఫైటర్లలోని ఆరుగురు పైలట్లు సురక్షితంగా బయటపడ్డారని తెలిపాయి. ఒక్కో ఎఫ్-15ఈ ఫైటర్ విలువ రూ.1,100 కోట్లు.

### ఆరామ్‌కో చమురు రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడి

సౌదీ అరేబియాలోని అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారాల్లో ఒకటైన రాస్ తనురా రిఫైనరీపై ఇరాన్ డ్రోన్లతో దాడులు చేసింది. కొన్నింటిని మధ్యలోనే అడ్డుకోగా రెండు డ్రోన్లు రిఫైనరీని తాకి పేలుళ్లు సృష్టించాయి. దీనితో రిఫైనరీని తాత్కాలికంగా నిలిపివేశామని సౌదీ రక్షణ శాఖ ప్రతినిధి వెల్లడించారు. రాస్ తనురా రిఫైనరీ ప్రపంచంలోనే అతిపెద్ద చమురు సంస్థ ఆరామ్‌కోకు చెందినది. రిఫైనరీకి ఏ స్థాయిలో నష్టం జరిగిందనే వివరాలు వెల్లడి కాలేదు. ఇక కువైట్‌లోని అహ్మదీ చమురు రిఫైనరీపై డ్రోన్ దాడికి ప్రయత్నం జరిగింది.

చమురు ట్యాంకర్‌ను తాకిన డ్రోన్.. భారతీయ ఉద్యోగి మృతి

హోర్ముజ్ జలసంధిలో ఒమన్ తీరానికి సమీపంగా మార్షల్ ఐల్యాండ్స్ జెండాతో ప్రయాణిస్తున్న ఎంకేడీ వ్యోమ్ చమురు ట్యాంకర్ నౌకపై ఇరాన్ సోమవారం డ్రోన్ దాడి చేసింది. దీనితో నౌక ఇంజన్ రూమ్‌లో పేలుడు జరిగి మంటలు చెలరేగాయి. ఒక భారతీయ ఉద్యోగి మృతిచెందారు. ఘటన సమయంలో నౌకలో 16 మంది భారతీయులు, నలుగురు బంగ్లాదేశీలు, ఒక ఉక్రెయినీ సహా 21 మంది సిబ్బంది ఉన్నారని ఒమన్ మ్యారీటైమ్ సెక్యూరిటీ సెంటర్ వెల్లడించింది. వారిని రక్షించేందుకు చర్యలు చేపట్టామని తెలిపింది. శనివారం పలావ్ జెండాతో ప్రయాణిస్తున్న స్కైలైట్ చమురు ట్యాంకర్‌పైనా డ్రోన్ దాడి జరిగిన విషయం తెలిసిందే. అందులోని 15 మంది భారతీయ సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. ఇక బహ్రెయిన్ పోర్టులో ఆగి ఉన్న అమెరికా 'స్టెనా ఇంపరేటివ్' చమురు నౌకపైనా సోమవారం డ్రోన్ దాడులు జరిగి, మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో [illegible] చెందిన ఉద్యోగి ఒకరు మరణించారు.

### నాటాంజ్ అణుక్షేత్రంపై యూఎస్, ఇజ్రాయెల్ దాడి..

టెహ్రాన్: అమెరికా, ఇజ్రాయెల్ తాజాగా నాటాంజ్‌లోని ఇరాన్ ప్రధాన అణుక్షేత్రం (Natanz enrichment facility)పై దాడి చేసినట్టు ఇంటర్నేషనల్ ఆటమిక్ ఎనర్జీ ఏజెన్సీ (IAEA)లో ఇరాన్ రాయబారి రెజా నజాఫి తెలిపారు. అయితే దీనిని ఐక్యరాజ్యసమితి అణు నిఘా సంస్థ (UN nuclear watchdog) ఖండించింది. అణుక్షేత్రంపై దాడి జరిగిందనడానికి ఎలాంటి సాక్ష్యం లేదని తెలిపింది. ఇరాన్‌పై సైనిక చర్యను ఇప్పటికే అమెరికా-ఇజ్రాయెల్ సమర్థించుకున్నాయి. ఇరాన్ అణుసామర్థ్యాన్ని అడ్డుకోవడం ఒక ప్రధాన కారంగా తెలిపాయి. సొంతంగా అణ్వాయుధం తయారీ తుది దశలో ఇరాన్ ఉందని కూడా ఆ రెండు దేశాలు చెబుతున్నాయి.

అణుక్షేత్రంపై దాడి చట్టవిరుద్ధం

నాంటాజ్‌లోని అణుక్షేత్రంపై ఇజ్రాయెల్-యూఎస్ దాడి జరపడం చట్టవిరుద్ధమని రెజా నాజాఫీ ఆరోపించారు. ఇది పూర్తిగా నేరపూరిత, అనారిక చర్య అని అన్నారు. ఇరాన్ శాంతియుత సురక్షిత అణు సౌకర్యాలపై ఆదివారంనాడు మరోసారి దాడి జరిగిందని చెప్పారు. ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయాలనుకోవడం పూర్తిగా అబద్ధమని చెప్పారు. కాగా, నాటాంజ్‌లోని అణుక్షేత్రంపై దాడులను అమెరికా కానీ, ఇజ్రాయెల్ కానీ ఇంతవరకూ ధ్రువీకరించలేదు.

### ఎలాంటి సంకేతాలు లేవన్న ఐఏఈఏ డైరెక్టర్ జనరల్

మరోవైపు, ఇరాన్ అణు సౌకర్యాలపై దాడి జరిగినట్టు ఎలాంటి సంకేతాలు లేవని ఐఏఈఏ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రాస్సీ తెలిపారు. ఈ విషయంలో ఇరాన్ న్యూక్లియర్ రెగ్యులేటరీ అధికారులతో సంప్రదించేందుకు ప్రయత్నం చేస్తున్నట్టు చెప్పారు. అయితే ఇంతవరకూ ఎలాంటి స్పందన రాలేదన్నారు. ఇరాన్ సరిహద్దు దేశాల్లో రేడియేషన్ స్థాయిలు పెరిగిన సంకేతాలు కూడా లేవని చెప్పారు.

# కెనడాతో భారత్ యురేనియం డీల్

- యురేనియం సహా ఇతర కీలక ఖనిజాల సరఫరాకు కెనడా అంగీకారం
- 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 50 బిలియన్ డాలర్ల
- పౌర ఇంధన అవసరాల కోసమే..
- క్యాంప్‌సలు ఏర్పాటు చేయనున్న ఆ దేశ యూనివర్సిటీలు
- ఢిల్లీలో ఇద్దరు ప్రధానులు మోదీ, కార్నేల చర్చలు



న్యూఢిల్లీ: భారత్‌కు యురేనియం సహా ఇతర కీలక ఖనిజాలను సరఫరా చేసేందుకు కెనడా అంగీకరించింది. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 50 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4.15 లక్షల కోట్ల డాలర్లు) స్థాయికి చేర్చాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఇవన్నీ అమలుకు వీలుగా 'సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందా' (కాంప్రెహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ అగ్రిమెంట్-సీఈపీఏ)న్ని కుదుర్చుకోవాలని ప్రతిపాదించాయి. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న కెనడా ప్రధాని మార్క్ కార్నే, భారత ప్రధాని నరేంద్ర మోదీల మధ్య సోమవారం ఇక్కడి హైదరాబాద్ హౌస్ లో జరిగిన చర్చల్లో ఈ మేరకు అంగీకారం కుదిరింది. రక్షణ రంగం, కీలక సాంకేతిక పరిజ్ఞానం, చిన్న, మాడ్యులర్ తరహా అణు రియాక్టర్ల సరఫరా, విద్య, పునరుత్పాదక ఇంధన రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని ఇరువురు ప్రధానులు అంగీకరించారు. పౌర అణు విద్యుత్తు కోసం కెనడా 2.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.24వేల కోట్లు) యురేనియాన్ని సరఫరా చేయనుంది. అమెరికాతో ఆర్థిక సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో భారత్‌తో వాణిజ్యాన్ని పెంచుకోవాలని భావిస్తున్న కెనడా అందుకు అనుగుణంగా చర్చలు జరిపింది. తొలుత ముంబైలో దిగి అక్కడ రెండు రోజులు పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపిన ప్రధాని కార్నే ఆదివారం ఢిల్లీ రావడం గమనార్హం. ప్రస్తుతం ద్వైపాక్షిక వాణిజ్యం ఏటా 13 బిలియన్ డాలర్లు (రూ.1.20వేల కోట్లు) వరకు ఉండగా, దాన్ని గణనీయంగా పెంచాలని నిర్ణయించారు. అందుకే రెండు దేశాల్లో పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు పెరిగేలా సమగ్ర ఒప్పందాన్ని కుదుర్చుకోనున్నట్టు ఈ సందర్భంగా మోదీ ఓ ప్రకటనలో తెలిపారు. భారత్‌లో కెనడా పెట్టుబడిదార్లు 100 బిలియన్ డాలర్లు (సుమారు రూ.9లక్షల కోట్లు)వరకు పెన్షన్ ఫండ్‌ల్లో పెట్టారని, దేశం వృద్ధిపై వారికున్న విశ్వాసానికి ఇదే నిదర్శనమని చెప్పారు.

దీర్ఘకాలం పాటు యురేనియం సరఫరా చేయడం కీలక అంశమని తెలిపారు. ఇంధన రంగంలో రానున్న తరానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానంపైనా ఒప్పందం కుదిరిందని చెప్పారు. హైడ్రో కార్బన్లు, గ్రీన్ హైడ్రోజన్, ఎనర్జీ స్టోరేజ్, సౌర, పవన విద్యుత్తు, విద్యుత్తు వాహనాలు, తదితర అంశాల్లో సహకారం ఉంటుందని వివరించారు. విద్యా రంగంలో కుదిరిన ఒప్పందాలను మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. ఏఐ, ఆరోగ్యం, వ్యవసాయం, ఆవిష్కరణలు తదితర అంశాల్లో ఇరు దేశాల విశ్వవిద్యాలయాల మధ్య భాగస్వామ్యం ఉంటుందని తెలిపారు. కెనడా యూనివర్సిటీలు భారత్‌లో క్యాంప్‌సలు ఏర్పాటు చేసుకోవచ్చని వెల్లడించారు. పశ్చిమాసియాలోని తాజా పరిస్థితిపైనా చర్చించారు. సంప్రదింపులు, దౌత్యపర మార్గాల్లోనే సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించా రు. స్వచ్ఛమైన, నమ్మకమైన ఇంధన సరఫరా కోసమే యురేనియం ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్టు కెనడా ప్రధాని కార్నే తెలిపారు. దీనిని 'ల్యాండ్ మార్క్' ఒప్పందంగా ఇరు దేశాలు అభివర్ణించాయి. రెండు దేశాల మధ్య కుదిరే స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాన్నే అధికారికంగా 'సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం'గా పిలుచుకుంటున్నాయి. ఒప్పందంలోని అంశాలను త్వరగా ఖరారు చేయాలని నిర్ణయించారు.

# తమ్మినేనిపై అభిశంసన

(మొదటి పేజీ తరువాయి)

సదరు లాబీయింగ్, గుసగుస లు, తెరవెనుక జరిగిన మంత్రాంగం, ప్రచారం పట్ల తీవ్ర ఆరోపణలు వ్యక్తం చేశారు. అలాంటి ప్రవర్తనలకు సీనియర్ నాయకులే పాల్పడడం మునుపెన్నడూ ఎన్నడూ జరగలేదు. ఇది పార్టీ సంప్రదాయాలకు, రాజకీయ సంస్కృతికి పూర్తి విరుద్ధమైనది'' అని కేంద్రకమిటీ స్పష్టం చేసింది. రాష్ట్ర కమిటీ సభ్యుల్లో ఒక భాగం.. పార్టీ సమిష్టి ప్రయోజనాలు, సూత్రాలకన్న మిన్నగా వ్యక్తిగత ఆకాంక్షలతో వ్యవహరిస్తున్నారని పేర్కొంది. వీటన్నింటిపై గతంలోనే తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు, ప్రసాద్‌ల వివరణను కేంద్రకమిటీ కోరింది. వారి వివరణలను పరిశీలించి.. వాటిపైనా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వారిచ్చిన వివరణలు అసమగ్రంగా ఉన్నాయని, వాటిలో ఆత్మవిమర్శ లోపించిందని పేర్కొంటూ ముగ్గురినీ అభిశంసించింది. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. వీరభద్రాన్ని రాష్ట్ర సెక్రటేరియట్ కమిటీ సమావేశాల్లో పరిశీలకులుగా ఉండాలని, రాష్ట్ర సెక్రటేరియట్ మార్గదర్శకత్వంలో నడుచుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర కమిటీకి కేంద్రకమిటీ 4 పేజీల సుదీర్ఘ లేఖ రాసింది. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగినసీపీఎం కీలక భేటీలో దీనిపై చర్చించారు.

# పెండింగ్ బకాయిలు చెల్లించాలి

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 6.4 లక్షల మందికి సంబంధించిన బకాయిలు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండటం దారుణమన్నారు. గ్రాట్యూటీ, కమ్యూటేషన్, పీఎఫ్ బకాయిలతో పాటు ఆరు డీఏలను ప్రభుత్వం ఇప్పటికీ చెల్లించలేదని పేర్కొన్నారు. కోర్టుల ఒత్తిడి భయంతో ఇటీవల ఒక డీఏ ప్రకటించి చేతులు దులుపుకున్నారని, ఉద్యోగులసమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ధ్వజమెత్తారు. సిగ్గులేకుండా తన పదవిని కాపాడుకోవడం కోసమే గాంధీ కుటుంబానికి వెయ్యి కోట్ల రూపాయలు ఇస్తానని అంటున్నారని, రాబోయే ఎన్నికల కోసం డబ్బులు జమచేయడమే ఈ ప్రభుత్వం లక్ష్యంగా మారిందని ఆయన విమర్శించారు. అనంతరం ఎంపీ డీకే అరుణ మాట్లాడారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లు అయ్యిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

# మీరు ప్రధాని కావాలి!

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి శక్తివంతమైన నాయకుడిగా ఎదిగారంటూ రాహుల్‌గాంధీ ప్రశంసించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు బాగా అమలు చేస్తున్నారంటూ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను డీసీసీ అధ్యక్షులు తీసుకోవాలని సూచించారు. పార్టీలో పాత, కొత్తనేతలు అంటూ లేదని, అందరూ కలిసి పార్టీని ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. కాగా, ప్రధాని అభ్యర్థిత్వ బాధ్యతలు తీసుకునేందుకు రాహుల్‌గాంధీ సంసిద్ధత వ్యక్తం చేసిన నేపథ్యంలో లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేతగానూ ఆయన పేరును ప్రతిపాదించింది కూడా రేవంత్‌రెడ్డేనంటూ పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత ఎంపికకు సంబంధించి సీడబ్ల్యూసీ సమావేశంలో చర్చ వచ్చినప్పుడు ఆ బాధ్యతలు తీసుకోవాలంటూ రేవంత్.. రాహుల్‌ను కోరారని చెబుతున్నారు. మళ్లీ ఇప్పుడు ప్రధాని అభ్యర్థి బాధ్యతలు తీసుకోవాలంటూ రేవంత్ రాహుల్‌ను కోరడం, ఆయన సంసిద్ధత వ్యక్తం చేయడం జరిగింది. వికారాబాద్ హరిత రిసార్ట్‌లో "సంఘటన సృజన్ అభియాన్" కార్యక్రమం భాగంగా నిర్వహించిన డీసీసీ అధ్యక్షుల పది రోజుల శిక్షణ శిబిరం ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాహుల్ గాంధీ, కేసి వేణు గోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి విచ్చేసి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

# తలనొప్పిగా రాజ్యసభ ఎలక్షన్స్

హైదరాబాద్, మార్చి 2, (వార్త వేదిక సూర్య):

తెలంగాణ కాంగ్రెస్‌లో రాజ్యసభ సీట్ల ఎంపికపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఆశావహులు పెద్దఎత్తున ఉండడంతో ఎవరిని అదృష్టం వరిస్తుందోనని గాంధీభవన్ లో ఉత్కంఠ నెలకొంది. ఖాళీ అవుతున్న 2 రాజ్యసభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి తమకున్న బలంతో ఒక సీటు ఏకపక్షంగా దక్కనుంది. అయితే, రెండో సీటును దక్కించుకోవాలంటే అవసరమైన మ్యాజిక్ ఫిగర్ కోసం కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక కేవలం సామాజిక సమీకరణాలకే పరిమితం కాకుండా, జాతీయ స్థాయిలో పార్టీకి అండగా నిలిచే నేతల వైపు మొగ్గు చూపుతున్నట్టు సమాచారం.ఒక రాజ్యసభ స్థానాన్ని గెలవడానికి కనీసం 40 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. కాంగ్రెస్ పార్టీకి సొంతంగా 66 మంది ఎమ్మెల్యేలు ఉండగా, ఒక సీపీఐ ఎమ్మెల్యే, ఏడుగురు ఎంఐఎం సభ్యుల మద్దతుతో ఈ సంఖ్య 74కు చేరుతుంది. మొదటి సీటును 40 ఓట్లతో గెలిచిన తర్వాత, కాంగ్రెస్ వద్ద మిగిలేది 34 ఓట్లు మాత్రమే. రెండో సీటు గెలవాలంటే మరో 6 ఓట్లు అదనంగా అవసరం. మరోవైపు.. విపక్షాలకు కూడా రెండో సీటును కైవసం చేసుకునేంత బలం లేదు. బీఆర్ఎస్ కు 36మంది ఎమ్మెల్యేలు ఉండగా. అందులో దాదాపు 10 మంది కాంగ్రెస్ గూటికి చేరారు. బీజేపీకి 8 మంది మాత్రమే ఉన్నారు. దీంతో ఈ సీటును దక్కించుకోవడం బీఆర్ఎస్, బీజేపీకి వీలు కాదు.

## జనాభా దామాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ లు పెంచాలి

హైదరాబాద్, మార్చి 2 (వార్త వేదిక సూర్య):

రాష్ట్రంలో ఎస్సీల జనాభా 15 శాతం నుంచి 18 శాతానికి పెరిగినట్టు గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేతో పాటు ప్రస్తుత ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణనలో స్పష్టం అయిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఎస్సీ ఉప కులాల నాయకులతో సమావేశం అయ్యారు. పెరిగిన ఎస్సీల జనాభాకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలి.. ఇందుకోసం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే తీర్మానం తీర్మానం చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం చేపట్టే జనగణన పూర్తి అయి అధికారికంగా లెక్కలు ప్రకటించిన తర్వాత ఎస్సీ రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించిందని గుర్తు చేశారు. దానికి అనుగుణంగా రిజర్వేషన్ల పెంపునకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఉప కులాలకు విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ రంగంలోనూ రిజర్వేషన్లు దక్కాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ ఉప కులాలతో కలిసి రిజర్వేషన్ల పెంపు సహా వారి సమస్యల పరిష్కారం కోసం జాగృతి ఉద్యమిస్తుందని తెలిపారు. ఎస్సీ ఉప కులాల్లో కొన్ని కులాలకు క్యాస్ట్ సర్టిఫికెట్ల జారీలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో 20 ఎస్సీ ఉప కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీ.. రూ.1000 కోట్ల వసూలుకు వచ్చారా?: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 2 (వార్త వేదిక సూర్య):

లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఆసక్తికర పోస్టు చేశారు. గాంధీ కుటుంబానికి రూ.1000 కోట్లు ఇస్తానని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్ పోస్టు ప్రాధాన్యం సంతరించుకుంది. ఎక్స్‌లో కేటీఆర్ ఏమన్నారంటే.. 'హలో రాహుల్‌గాంధీ.. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (AICC) ఏటీఎం అయిన తెలంగాణకు స్వాగతం' అంటూ వెల్‌కమ్ చెప్పారు. 'మీరిప్పుడు సీఎం దగ్గర రూ.1000 కోట్లు వసూలు చేసుకోవడానికి వచ్చారా..?' అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. 'పనిలోపనిగా మీరు 100 రోజుల్లో అమలుచేస్తామని చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 ఇతర వాగ్దానాల పురోగతిని సమీక్షించడంపై కూడా కొంచెం శ్రద్ధ పెట్టండి' అని సూచించారు.

## తుమ్మనపేటలో విరోషి దంపతుల సందడి

మహబూబ్ నగర్, మార్చి 2 (వార్త వేదిక సూర్య):

స్టార్ హీరో విజయ్ దేవరకొండ తన భార్య రష్మికతో కలిసి తన సొంతూరు తుమ్మనపేటలో సందడి చేశారు. సోమవారం ఉదయం ఫ్యామిలీతో కలిసి గ్రామానికి చేరుకున్న ఆయనకు ఊరి ప్రజలు ఘన స్వాగతం పలికారు. డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపుగా కొత్త జంటకు ఆహ్వానం పలికిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు నిండు మనసుతో ఆశీర్వదించారు. విజయ్ స్వస్థలం తెలంగాణలోని నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బల్మూర్ మండలంలోని తుమ్మన పేట గ్రామం. ఓ మారుమూల గ్రామం నుంచి వచ్చిన విజయ్ తన టాలెంట్తో ఇండస్ట్రీలో స్టార్ హీరోగా ఎదిగారు. తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. పెళ్లి తర్వాత తన భార్య రష్మికతో కలిసి ఫస్ట్ టైం సొంతూరికి రావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. తన చిన్న నాటి స్నేహితులు అందరినీ ఆప్యాయంగా పలకరించారు విజయ్. తుమ్మనపేటలో నూతనగా నిర్మించిన ఫామ్ హౌస్లో గృహ ప్రవేశం నిర్వహించారు. ఆ తర్వాత కొత్త దంపతులతో నూతన గృహంలో సత్య నారాయణ వ్రతం జరిపించారు. ఈ వేడుకలో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. తన గ్రామస్థుల సమక్షంలోనే ఈ వేడుక జరగాలని విజయ్ భావించగా... కొత్త జంట సంబరంతో గ్రామంలో సందడిగా మారింది. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాజస్థాన్లోని ఉదయపూర్లో ఫిబ్రవరి 26న విజయ్ దేవరకొండ, రష్మిక వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఆ తర్వాత హైదరాబాద్ చేరుకున్న వీరు దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో అభిమానులకు స్వీట్స్ పంపిణీ చేశారు. ఏపీ, తెలంగాణ సహా ప్రముఖ ఆలయాల్లో అన్నదానం కూడా చేశారు. వీరి అభిమానులు సైతం పలు గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు. హైదరాబాద్లోని తాజ్ హోటల్లో మార్చి 4న వివాహ రిసెప్షన్ జరగనుంది. టాలీవుడ్ టాప్ సెలబ్రిటీలతో పాటు పొలిటికల్ లీడర్స్ ఈ వేడుకకు హాజరు కానున్నారు. ఆదివారం రష్మిక తెలంగాణ సీఎం రేవంత్ ఫ్యామిలీని కలిసి రిసెప్షన్కు ఆహ్వానించారు. అలాగే, విరోష్ కపుల్ స్వయంగా అల్లు అరవింద్ ఇంటికి వెళ్లి వారి ఫ్యామిలీని ఆహ్వానించారు. కొత్త పెళ్లి కొడుకు అల్లు శిరీష్కు విషెష్ తెలిపారు. రిసెప్షన్ సందర్భంగా ఫ్యాన్స్కు స్పెషల్ రిక్వెస్ట్ చేశారు.ఆహ్వానం ఉన్న అతిథులు మాత్రమే ఈవెంట్కు రావాలని విరోష్ కపుల్ విజ్ఞప్తి చేశారు. ఆహ్వానం లేకుండా వచ్చి ఇబ్బంది పడొద్దని సూచించారు.

## రికార్డులు బ్రేక్..

హైదరాబాద్, మార్చి 2, (వార్త వేదిక సూర్య):

తెలంగాణలో విద్యుత్ వినియోగం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇవాళ 6,267 మెగావాట్లకు చేరుకుంది. దీనికి కారణంగా ఎండల తీవ్రత పెరగటమేనని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వెల్లడించారు. రానున్న రోజుల్లో మరింత విద్యుత్ వినియోగం ఉంటుందని అందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. ఈసారి ఫిబ్రవరి రెండో వారం నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఉదయం 8 తర్వాత నుంచే ఎండలు భగ భగ మండుతున్నాయి. మధ్యాహ్నం సమయానికి కాలు బయట పెట్టలేని పరిస్థితి. ఇక రాత్రి సమయాల్లో తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

## ఈ సారి భారీ ఎండలు..

హైదరాబాద్, మార్చి 2 (వార్త వేదిక సూర్య):

తెలుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) గట్టి హెచ్చరికలు జారీ చేసింది. ఈ ఏడాది మార్చి నుంచి మే నెల వరకు (ఎంఏఎం సీజన్... మార్చి-ఏప్రిల్-మే) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండల తీవ్రత అత్యధికంగా ఉండనుందని స్పష్టం చేసింది. సాధారణంగా వేసవిలో ఉండే ఉష్ణోగ్రతల కంటే ఈసారి పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని, ముఖ్యంగా వడగాల్పుల రోజులు గణనీయంగా పెరుగుతాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర వెల్లడించారు. ఇప్పటికే ఫిబ్రవరి నెలలో 2001 తర్వాత అత్యల్ప వర్షపాతం నమోదు కావడం, చలి తీవ్రత తక్కువగా ఉండటం రాబోయే కఠిన వేసవికి సంకేతాలని విశ్లేషిస్తున్నారు.





# నిర్దేశించిన లక్ష్యాలను నూటికి నూరు శాతం సాధించడంపై జిల్లా అధికారులు దృష్టి సారించాలి

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

నల్లగొండ బ్యూరో, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)

ఈ ఆర్థిక సంవత్సరం ముగియనున్న దృష్ట్యా ఆయా శాఖల ద్వారా నిర్దేశించిన లక్ష్యాలను నూటికి నూరు శాతం సాధించడం పై జిల్లా అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ చెప్పారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలిసి ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణి ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ లో పెట్టుకోవద్దని అన్నారు. అలాగే ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సైతం ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. హాస్టళ్ల తనిఖీపై నిర్దేశించిన ప్రొఫార్మాలో మండలాల ప్రత్యేక అధికారులు నివేదికను సమర్పించాలని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31 తో ముగియనున్నందున ఆయా పద్దుల కింద మంజూరైన నిధులు, చేపట్టిన పనులను నిర్దేశించిన సమయంలో గా పూర్తిచేసేలా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని, బడ్జెట్ వృధా కాకుండా చూడాలని అన్నారు. వేసవి కార్యచరణ ప్రణాళిక కు సంబంధించి ప్రత్యేక అధికారులు వెంటనే మండల స్థాయిలో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ఉపాధి హామీ, స్కాలర్షిప్ ల మంజూరు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఇతర ఇంజనీరింగ్ శాఖలు, తదితర శాఖల ద్వారా చేపట్టిన పనులన్నిటిని ఎట్టి పరిస్థితులలో ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు పూర్తి చేయాలన్నారు. రానున్న పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.మార్చి 15 నుండి 20 మధ్యలో రబీ ధాన్యం కొనుగోలు ప్రారంభం కానున్న దృష్ట్యా మండలాల ప్రత్యేక అధికారులు భాగస్వాములు కావాలని, రాష్ట్ర జిల్లా స్థాయి నుండి ఎప్పటికప్పుడు రూపొందించే అన్ని రకాల కార్యాచరణ పనులలో భాగస్వాములై విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ ను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. రంజాన్ సందర్భంగా ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వం ఇచ్చే తోఫా పంపిణీ, మహిళా యోజన, కుట్టు మిషన్ల పంపిణీ, తదితర కార్యక్రమాలన్నింటిని మండలాల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సోమవారం మొత్తం (123) ఫిర్యాదులు రాగా, రెవిన్యూ శాఖకు (59) ఫిర్యాదులు , జిల్లా అధికారులకు(64) ఫిర్యాదులు వచ్చాయి.




## లక్ష్యదిత్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న కేతావత్ భిల్యా నాయక్, కంకణాల వెంకట్ రెడ్డి

దేవరకొండ మార్చి 2 (వార్త వేదిక సూర్య):

చింతపల్లి మండల పరిధిలోని గొడకోండ్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు గ్యార పోషయ్య మనువడు గ్యార తన్మయి, కరుణాకర్ కుమారుడు లక్ష్యదిత్ మెదటి పుట్టిన రోజు వేడుకలు మాల్ లో ఎస్ ఎస్ కన్వేషన్ హాల్ లో జరుగగా అట్టి కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్, కంకణాల వెంకట్ రెడ్డి ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండురు శ్రీనివాస్,పూల యాదయ్య, మల్లేష్,గోపి, ఓంకార్ చంద్రయ్య,మోతిరాం నాయక్, జైపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

## ఎల్ఐసి బ్రాంచ్ ఏజెంట్ కర్నాటి రాముకు సన్మానం



గట్టుప్పల.ఫిబ్రవరి2.వార్త వేదిక సూర్య:

నల్లగొండ జిల్లా గట్టుప్పల మండల కేంద్రానికి చెందిన కర్నాటి రాము జీవిత బీమా సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక మందికి జీవిత బీమా పాలసీలు అందించి హైదరాబాద్ డివిజన్ స్థాయిలో పాలసీ టార్గెట్ ను పూర్తిచేసి వనస్థలిపురం బ్రాంచ్ ను ప్రథమ శ్రేణిలో నిలిపిన బ్రాంచ్ ఏజెంట్ జాతీయ అవార్డు గ్రహీత ఎండిఆర్టి కర్నాటి రాము ను హైదరాబాద్ సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి సోమవారం అభినందించి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డివిజన్ మార్కెటింగ్ మేనేజర్ ప్రసాదరావు, మార్కెటింగ్ సేల్స్ మేనేజర్ భాస్కర్,క్లియా మేనేజర్ రవి శంకర్,బ్రాంచ్ సీనియర్ మేనేజర్ రతి రాము, బిఎం సేల్స్ జాను, బ్రాంచ్ మేనేజర్ రామ్ చందర్, డెవలప్మెంట్ ఆఫీసర్స్ మరియు ఏజెంట్ల బృందం పాల్గొన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



దేవరకొండ మార్చ్ 2 (వార్త వేదిక సూర్య ):

చింతపల్లి మండలం మాల్ పట్టణంలోనీ ఎస్ ఎస్ కన్వెన్షన్ జరిగిన గ్యార కర్ణాకర్-తన్మయి ల కుమారుల పుట్టిన రోజు వేడుకలలో బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఆయన వెంట పలువురు బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



## చేనేత రుణమాఫీ నిధులను వెంటనే విడుదల చేయాలి

**బిఆర్ఎస్ మండల కన్వీనర్ ఇడం కైలాసం**

గట్టుప్పల.ఫిబ్రవరి.2.వార్త వేదిక సూర్య:

గట్టుప్పల మండల కేంద్రం లో చేనేత కార్మికులతో కలిసి బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ ఇడం కైలాసం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలలో చేనేతలకు 2 లక్షలు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల తరువాత దానికి లక్షకు కుదించి చేనేతల పట్ల చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. ఇచ్చిన లక్ష రూపాయల రుణ మాఫీ కూడా పట్టణ ప్రాంతాలకే పరిమితం చేశారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చేనేత కార్మికులను విస్మరించడం అన్యాయమని అన్నారు. వెంటనే రుణ మాఫీ నిధులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు, చేనేత భరోసా, త్రిఫ్ట్ ఫండ్ నిధులు వెంటనే విడుదల చేసి అమలు చేయాలని కోరారు. రుణమాఫీ చేయని యెడల త్వరలో కార్మికులతో కలిసి ఉద్యమం చేపట్టి కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో గంజి పెద్దలు, బడుగు తిమ్మయ్య, నామని గణేశ రవ్వ రాములు, సూరేపల్లి బుచ్చయ్య,పులిపాటి వెంకటేశం, పెదగాని రాములు,గుర్రం రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు

**అందరి జీవితాల్లో నిత్య వసంతం వెల్లివిరియాలి**

**బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ దేవరకొండ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

దేవరకొండ మార్చి 2 (వార్తా వేదిక సూర్య):



దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ దేవరకొండ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అందరి జీవితాల్లో నిత్య వసంతం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు హోలీ నేపథ్యంలో పల్లెల్లో వెన్నెల నవరాత్రుల్లో సాగే చిన్నారుల జాజిరి ఆటాపాటలతో, కోలాటాల చప్పుళ్లతో ఉత్తేజం వెల్లివిరుస్తుందని పేర్కొన్నారు. చిన్నాపెద్దా తేడాలేకుండా సింగిడి రంగుల నడుమ కేరింతలతో సాగే హోలీ మానవ జీవితమే ఒక వేడుక అనే భావనను, ప్రకృతితో మమేకమై జీవించాలనే తత్వాన్ని అందిస్తుందని తెలిపారు. భేదభావాలను వీడి పరస్పర ప్రేమ, అభిమానాలను చాటుకొంటూ ప్రజలందరూ మోదుగుపూల వంటి సహజసిద్ధమైన రంగులతో హోలీ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ నేతృత్వంలోని కేసీఆర్ సర్కార్ చేపట్టిన ప్రగతి కార్యాచరణ.. తెలంగాణలోని దళిత, బహుజన, సకలజనుల జీవితాల్లో నిత్య వసంతాన్ని నింపిందని ఆయన తెలిపారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వీరేశం శంకుస్థాపన

నల్లగొండ టౌన్, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)

నకిరేకల్ మండలం మంగళపల్లిలో గ్రామ సర్పంచ్ గాదరి జయమ్మ, పాలకర్గం ఆద్వర్యంలో 35 లక్షల రూపాయల నిధులతో సంఘభందం భవనం, సీసీ రోడ్లు, డ్రైనేజీలకు కాంగ్రెస్ జిల్లా నాయకుడు బొచ్చుపల్లి గంగాధర్ రావుతో కలిసి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పల్స రజిత,మార్కెట్ డైరెక్టర్ బొల్లెద్దు లక్ష్మయ్య, పిఎసిఎస్ డైరెక్టర్లు బచ్చుపల్లి భుజంగరావు, గొడ్డేటి సైదులు యాదవ్, ఉప సర్పంచ్ బచ్చుపల్లి రామలింగారావు, పాల సంఘం చైర్మన్ చింతల ముత్తయ్య యాదవ్,వార్డు సభ్యులు కొప్పుల వెంకన్న గౌడ్,కందికంటి సైదమ్మవెంకన్న, మంద నాగయ్య, రాచమ్మ పద్మ జానయ్య,కట్టా మాదవిదన్ రాజ్,చింతల వీరయ్య యాదవ్,బొల్లెద్దు తేజశ్వినినాగరాజు,పూల రమాదేవిసతీష్,రాచమళ్ళ సైదులు తదితరులు పాల్గొన్నారు.





## సేవ చేయడంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ శక్తి న్యూ వాయిస్ ముందంజలో ఉంటుంది

**క్లబ్ జోన్ చైర్ పర్సన్ డాక్టర్ ఝాన్సీ రాణి పసలపూడి**

నల్లగొండ బ్యూరో, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)

అనాథలకు, పేదలకు సేవ చేయడంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ శక్తి న్యూ వాయిస్ ముందంజలో ఉంటుందని క్లబ్ జోన్ చైర్ పర్సన్ డాక్టర్ ఝాన్సీ రాణి పసలపూడి అన్నారు. సోమవారం స్థానిక మదర్ తెరిసా హోమ్ లో గతంలో సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ అడ్వైజరీ బోర్డు మెంబర్ గా పనిచేసిన స్వర్గీయ కరుణారెడ్డి 87 వ జయంతి సందర్భంగా వృద్ధులకు పండ్లు, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆఫ్ శక్తి న్యూవాయిస్ ఆధ్వర్యంలో అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, కరుణ రెడ్డి జయంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు రజిత రెడ్డి, అజితా రెడ్డి, పూర్ణిమా రెడ్డి లు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మా క్రాంతి, స్వాతి రాంబాబు, మదర్ తెరిసా హోమ్ సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.





## డాక్టరేట్ పట్టా ప్రదానం



నల్గొండ టౌన్, మార్చి 2 (వార్త వేదిక సూర్య)

నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగంలో ఒప్పంద అధ్యాపకురాలిగా పని చేస్తున్న మిస్కిన్ తరన్నంకు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన శ్రీ జగదీష్‌ప్రసాద్ ఝుబర్మల్ తిబ్రేవాలా విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టా ప్రదానం చేసింది. ఆమె ప్రొఫెసర్ డాక్టర్ ఇమ్రాన్ ఖాన్‌లి పర్యవేక్షణలో జెనెటిక్ రిసోర్సెస్ అండ్ కన్జర్వేషన్ ఆఫ్ మేజర్ కార్ప్స్ ఇన్ సౌత్ ఇండియన్ రీజియన్ అండ్ ఇట్స్ డిస్ట్రిబ్యూషన్ అనే అంశంపై పరిశోధన చేశారు. దక్షిణ భారతదేశంలోని ప్రధాన కార్ప్ చేపల జన్యు వనరులు, వాటి వైవిధ్యం, భౌగోళిక విస్తరణ, సంరక్షణ అవసరాలు వంటి అంశాలను లోతుగా అధ్యయనం చేసి, శాస్త్రీయ ఆధారాలతో కూడిన విశ్లేషణ సమర్పించారు. ఈ పరిశోధన ద్వారా చేపల జన్యు సంపద పరిరక్షణ, ఆక్వా కల్చర్ అభివృద్ధి, జీవ వైవిధ్య సంరక్షణకు దోహదపడే విలువైన సూచనలు అందించారని విశ్వవిద్యాలయ వర్గాలు ప్రశంసించాయి. పరిశోధన ఫలితాలు భవిష్యత్తులో చేపల ఉత్పత్తి పెంపు, స్థానిక జాతుల పరిరక్షణ, మరియు పర్యావరణ సమతుల్యత కాపాడడంలో కీలక పాత్ర పోషించనున్నాయని పేర్కొన్నారు. డాక్టరేట్ సాధించిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ కె. శ్రీనివాసరాజు, గ్రంథాలయాధిపతి డాక్టర్ సుంకరి రాజారాం, జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ చి. సమత, డాక్టర్ కె. వనజ, డాక్టర్ మల్లేష్, వైష్ణవి, సంతోష్ కుమార్ తదితర అధ్యాపకులు ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా అధ్యాపక వర్గం మాట్లాడుతూ, మిస్కిన్ తరన్నం సాధించిన ఈ విజయంతో కళాశాలకే గౌరవం పెరిగిందని, విద్యార్థులకు ఇది ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు చేసి జంతుశాస్త్ర రంగానికి సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## జర్నలిస్టులుగా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేలా చూడాలి

**నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి**



నల్లగొండ టౌన్, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)

ప్రభుత్వం ప్రజల కోసం తీసుకువస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేలా జర్నలిస్టులు కృషి చేయాలని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి కోరారు. నల్లగొండ మొట్టమొదటి మేయర్ గా బాధ్యతలు స్వీకరించిన బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డిని సోమవారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నల్లగొండలోని ఆమె నివాసంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా జర్నలిస్టులు కృషి చేయాలని, కార్పొరేషన్ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో ప్రజా సంక్షేమంతో పాటు నల్లగొండలో సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని అందులో జర్నలిస్టుల భాగస్వామ్యం కూడా అవసరం అన్నారు. ఏళ్ళ తరబడి ఎదురు చూస్తున్న జర్నలిస్టుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పులిమామిడి మహేందర్ రెడ్డి, గాదె రమేష్, టీయూడబ్ల్యుజే 143 అధ్యక్షులు గుండగోని జయశంకర్ గౌడ్ మాట్లాడుతూ నల్గొండ కార్పొరేషన్ అభివృద్ధికి జర్నలిస్టులుగా తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడాలని మంత్రి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి జర్నలిస్టులకు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, జర్నలిస్టులు వెంకట్ రెడ్డి, అల్లి మల్లికార్జున్ యాదవ్, దండంపల్లి రవికుమార్, ఉబ్బని సైదులు, నీలం వెంకటమధు, రెడ్డిపల్లి యాదగిరి, పిల్లలమర్రి శ్రీనివాస్, ముచ్చర్ల విజయ్, ముచ్చర్ల శ్రీనివాస్, కారింగు శ్రీనివాస్, చింత యాదగిరి, రవిశంకర్, వినోద్, రమేష్, పెద్దగోని మధు, పామనగుండ్ల నవీన్,భోగరి రామకృష్ణ, ఓడపల్లి మధు, రవి, కత్తుల హరి, కట్ట యాదయ్య, పెరుమాళ్ళ విజయ్ కుమార్, జానీ నవీన్ గౌడ్,రామకృష్ణ,శివ,రవి తదితరులు పాల్గొన్నారు.

## పులిరాజ్ గౌడ్ నీ పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ మార్చ్ 2 (వార్త వేదిక సూర్య):

చింతపల్లి మండలం గోడుకొండ్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బాదేపల్లి పులిరాజ్ గౌడ్ ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లోని లైఫ్ స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమ వారం లైఫ్ స్టార్ ఆసుపత్రిలో పులిరాజ్ గౌడ్ నీ బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించాలని ఆయన సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సంపుటి : 1, సంచిక : 276 వార్త వేదిక సూర్య యాదాద్రి భువనగిరి మంగళవారం, మార్చి 3, 2026



# నల్లగొండ మేయర్‌కి ఘన సన్మానం

### కార్పొరేషన్‌లో కోఆప్షన్ సభ్యుడిగా క్రిస్టియన్స్‌కి అవకాశం కల్పించాలి

నల్లగొండ బ్యూరో, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో కోఆప్షన్ సభ్యుడిగా క్రిస్టియన్స్ కి అవకాశం కల్పించాలని సియాన్ యూత్ అధ్యక్షుడు దున్న ప్రేమ్ కుమార్ కోరారు. సీయాన్ యూత్ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ని సోమవారం ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో క్రైస్తవులకు అవకాశం కల్పించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగాహాప్రేమ్ కుమార్ మాట్లాడుతూ క్రైస్తవల సంక్షేమ కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని రాజకీయపరంగా కూడా క్రైస్తవులకు అవకాశాలు కల్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం క్రైస్తవులు అండగా నిలిచారని గుర్తు చేశారు. ఇంతవరకు క్రైస్తవులకు ఎలాంటి రాజకీయ అవకాశాలు కల్పించలేదని ఇప్పటికైనా స్పందించి చొరవ తీసుకోవాలని కోరారు. మేయర్ ను కలిసిన వారిలో సియాన్ యూత్ ప్రధాన కార్యదర్శి రోషన్ జాకబ్, కోశాధికారి టీ ప్రవీణ్ కుమార్, సభ్యులు అఖిల్, చింటూ, సుమన్ రామన్, జయరాజ్, ప్రశాంత్, సాగర్ జాన్,హాతోదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన ఆశ్రిత్



నల్లగొండ బ్యూరో, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)

గణిత శాస్త్రంలో తనదైన ముద్ర వేస్తూ చర్లపల్లికి చెందిన విద్యార్థి అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారు. స్థానిక హైస్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న కోనేటి ఆశ్రిత్, ప్రతిష్ఠాత్మక 'సోఫ్' అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్-2026లో అద్భుత ప్రతిభ కనబరిచారు. తన మేధస్సుతో క్లిష్టమైన సమస్యలను ఛేదించి, 'ఇండియన్ మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్' పురస్కారాన్ని దక్కించుకున్నారు. చిన్నారి ఆశ్రిత్ సాధించిన ఈ విజయం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

# రానున్న రోజుల్లో బీసీలకు తగు ప్రాధాన్యం కల్పిస్తాం

### లోక్ సభ ప్రతిపక్ష కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

### రాహుల్ గాంధీతో భేటీ అయిన పున్నా కైలాష్ నేత




నల్లగొండ బ్యూరో, మార్చి 2 (వార్తా వేదిక సూర్య )

నల్గొండ జిల్లా డిసిసి అధ్యక్షులు పున్నా కైలాష్ నేత సోమవారం రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. వికారాబాద్ లోని హరిత రిసార్ట్స్ లో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ జిల్లాల డిసిసి అధ్యక్షుల శిక్షణ శిబిరం ముగింపు సమావేశానికి లోక్ సభ ప్రతిపక్ష కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత తన కుటుంబంతో సహా హాజరై వారితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. డిసిసి అధ్యక్షులు చాలా బలంగా పనిచేయాలని ప్రజలతో మమేకం అయితే పదవులు వస్తాయని నాయకుల చుట్టూ తిరిగితే రాదని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో బీసీలకు తగు ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత కుమారుడు జయంత్ విక్రమ్ రాహుల్ గాంధీ ఛాయ చిత్రంతో కూడిన జ్ఞాపికను అందజేశారు.

# టిసిసి ఫలితాలలో సత్తా చాటిన జే ఆర్ డ్రాయింగ్ అకాడమీ నల్గొండ

నల్లగొండ బ్యూరో, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)



ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ (టీసిసి) డ్రాయిం గ్ లోయర్ గ్రేడ్ మరియు హయ్యర్ గ్రేడ్ ఎగ్జామ్స్ రిజల్ట్స్ లో జే ఆర్ డ్రాయింగ్ అకాడమీ నల్లగొండ విద్యార్థిని విద్యార్థులు శాంభవి శ్రీవల్లి ప్రవస్థి మేఘన చందన, గోపీచంద్ వేద చరణ్, సాయి తేజ, చరిష్మా శివకుమారి, అఖిల, సిరి వర్షిని,సమన్విత. జిశాన్ సాయి రుషి ల్ రెడ్డి మౌనిక అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు అకాడమిక్ డైరెక్టర్ కారింగు జానయ్య గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని డైరెక్టర్ అభినందిస్తూ, శాలువాలతో వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఇతరులు పాల్గొన్నారు.

# నంది అవార్డు అందుకున్న డాక్టర్ పల్లకిషోర్ కుమార్



నల్లగొండ బ్యూరో, మార్చి 2 (వార్తా వేదిక సూర్య )

హైదరాబాద్ లోని బిర్లా ఆడిటోరియంలో మెగా ఫౌండేషన్ సినిమా సైడ్ యాక్టర్స్ శిరీష రెడ్డి అండ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో డాక్టర్ పల్లకిషోర్ కుమార్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌కు తెలుగు సినిమా కళాకారులు అందరు కలిసి బంగారు నంది అవార్డు అందజేసారు. సంగీత కళాకారుడుగా, తెలుగు నాటక రంగ పద్యాలు, తబలా ప్లేయర్ సోషల్ సర్వీస్ లో తను చేసిన కృషికి ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పల్లకిషోర్ కుమార్ మాట్లాడుతూ .. నాలుగో నంది అవార్డు అందుకోవడం ఎంతో సంతోషం గా ఉందన్నారు.

# సహజసిద్ధమైన రంగులతో హోళీ సంబరాలు నిర్వహించాలి

- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్
- హోళీ వేడుకలు ప్రశాంత వాతావరణంలో, ఇతరులకు హాని కలిగించకుండా జరుపుకోవాలి
- మహిళల భద్రతకు ప్రత్యేక నిఘా.. షీ టీమ్‌ల ముమ్మర పహారా
- డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగింపు.. ఉల్లంఘనలపై కఠిన చర్యలు



నల్లగొండ బ్యూరో, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)

రేపు నిర్వహించుకోనున్న హోళీ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపుతూ,హోళీ పండుగను సాంప్రదాయబద్ధంగా, పరస్పర గౌరవంతో, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించుకోవాలని జిల్లా ప్రజలను కోరారు. హోళీ వేడుకల సందర్భంగా సహజసిద్ధమైన రంగులను మాత్రమే ఉపయోగించాలని, హానికరమైన రసాయనిక రంగులను వాడకూడదని సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా బలవంతంగా రంగులు చల్లడం, నీటి బెలూన్లు విసరడం వంటి చర్యలు చేయరాదని హెచ్చరించారు. ప్రార్థనా మందిరాలు, ప్రజా ప్రదేశాలు, రహదారులపై వాహనదారులకు ఆటంకం కలిగించే విధంగా ప్రవర్తించవద్దని తెలిపారు.మహిళల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇందుకోసం జిల్లాలో షీ టీమ్ బృందాలను ప్రత్యేకంగా మోహరింపజేసి, ప్రధాన కూడళ్లలో మరియు జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పండుగ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత వాహనాలను అతివేగంగా నడపకుండా జాగ్రత్తగా ఉండాలని, రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈత రాని వారు చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లకూడదని, చిన్నపిల్లలను అటువంటి ప్రదేశాలకు తీసుకెళ్లరాదని విజ్ఞప్తి చేశారు. లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పండుగ వేళ ఎవరైనా గొడవలు సృష్టించినా, అసత్య ప్రచారం చేసినా, సామాజిక మాధ్యమాల ద్వారా అపోహలు వ్యాప్తి చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా ప్రజలందరూ కలిసిమెలిసి, పరస్పర గౌరవంతో, సురక్షితంగా హోళీ పండుగను జరుపుకొని పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

# వాసవి క్లబ్ మరియు వాసవి వనిత క్లబ్ విద్యార్థులకు పరీక్ష ప్యాడులు పెన్నులు పంపిణీ

దేవరకొండ మార్చి 2 (వార్త వేదిక సూర్య):

కొండమల్లేపల్లి వాసవి క్లబ్ మరియు వాసవి వనిత క్లబ్ సంయుక్తంగా జెడ్పిహెచ్ఎస్ కొండ మల్లేపల్లి పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు మరియు పెన్నులు పంపిణీ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో ఎంఇఓ మరియు హెచ్ఎం నాగేశ్వరావు మాట్లాడు తూ విద్యార్థులు ఇష్టంతో చదివి మంచి మార్కులు తెచ్చి ఉత్తీర్ణత శాతం పెంచాలని, పాఠశాలకు పేరు ప్రతిష్టలు తేవాలని, పాలిటెక్నిక్, ఎస్ టి ఆర్జేసీ, ట్రిబుల్ ఐటీ , లలో సీట్లు తెచ్చుకోవాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కార్యదర్శి మారం వెంకటేశ్వర్లు, కోశాధికారి మిర్యాల నగేష్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షులు సముద్రాల స్వప్న కోశాధికారి దొడ్డి రమ, నగేష్, శ్రీనివాస్, శ్రీధర్ ,తిరుపతయ్య, మధు,




స్వప్న, రత్నకుమారి జయశ్రీ ,ఉదయశ్రీ, లక్ష్మి, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు జనార్దన్ రెడ్డి, కట్టబోయిన శ్రీనివాస్,అశోక్, సరస్వతి ,నీరజ




శోభారాణి జాన్ తదితరులు పాల్గొన్నారు.

# కడారి లచయ్య దశ దినకర్మ కార్యక్రమంలో పాల్గొనిన బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్

దేవరకొండ మార్చి 2 (వార్త వేదిక సూర్య):

గుడిపల్లి మండల పరిధిలోని మాదాపురం గ్రామంనికి చెందిన కడారీ లచయ్య దశ దినకర్మ కార్యక్రమంలో పాల్గొని ఆయన కుటుంబ సభ్యులను బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ పరామర్శించా రు. ఆయన వెంట కడారీ వెంకటయ్య అజ్మాపురం మాజీ సర్పంచ్ రామకృష్ణ వద్దిపట్ల మాజీ సర్పంచ్ రామావత్ అమృ నాయక్. విష్ణు వర్ధన్ రెడ్డి గురువయ్య శంకర్. తదితరులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత రెడ్డికి ధన్యవాదాలు

### తెలంగాణ ఎస్ సి వెల్ఫేర్ కార్యదర్శి మీసాల సైదులు



నల్లగొండ బ్యూరో, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)

తెలంగాణ రాష్ట్రంలో నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత రెడ్డి కి తెలంగాణ ఎస్ సి వెల్ఫేర్ కార్యదర్శి మీసాల సైదులు తెలంగాణ ఎస్ సి వెల్ఫేర్ అసోసియేషన్ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.."తెలంగాణ పబ్లిక్ స్కూల్" వంటి సమగ్ర విద్యా సంస్కరణల ద్వారా బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ఇంగ్లీష్ మాధ్యమ విద్య, ఆధునిక వసతులు, విశాలమైన ఆట స్థలాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, అర్హత కలిగిన ఉపాధ్యాయులు అందించాలనే ప్రభుత్వ సంకల్పం అభినందనీయం. ఈ విధానం ద్వారా ఎస్సి, ఎస్టి, బిసి ఇతర వెనుకబడిన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందుబాటులోకి రావడం సామాజిక న్యాయం దిశగా ఒక గొప్ప ముందడుగు అని మా సంఘం భావిస్తోందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ సంస్కరణలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, తెలంగాణ ఎస్ సి వెల్ఫేర్ అసోసియేషన్ ఎల్లప్పుడూ సహకారం అందించడానికి సిద్ధంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# ఎన్ఎస్‌పి భూములు, భవనాలలో ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అనుమతించాలి

### డా.యర్రమాద కృష్ణారెడ్డి

నల్లగొండ బ్యూరో, మార్చి 2 (వార్తా వేదిక సూర్య )

మిర్యాలగూడ పట్టణంలో గల ఎన్ ఎస్‌పి అధీనంలోని భూములు ,భవనాలలో ఆక్రమణల ను తొలగించి, ప్రభుత్వ కార్యాలయములు ఏర్పాటు చెయ్యాలని డా.కృష్ణారెడ్డి సోమవారం కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిర్యాలగూడ పట్టణంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని మిర్యాలగూడ పట్టణంలో ప్రజలందరికీ అందుబాటులో ఉన్న ఎన్ ఎస్ పి స్థలం, భవనాలు ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అనుగుణంగా ఉన్నది. ఈ ఎన్ ఎస్ పి ఆధీనంలో ఉన్న భూములు,భవనాలు కొంతమంది ఆక్రమించుకొని భవనాలు కట్టుకోవడం, వ్యాపారాలు నిర్వహించడం. స్థలాన్ని వారి అవసరాలకు వాడు కుంటున్నారని వారు తెలిపారు. దీని విషయంలో ఇప్పటికే పలు పిర్యాదులు ఉన్నవి. వీటిని తగిన విధంగా పూర్తి స్థాయిలో సర్వే చేయించి వందల కోట్ల విలువైన ఎన్ ఎస్ పి భూములను, భవనాలను కాపాడాలని ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అనుమతించాలని. ప్రజలకు ఉపయోగపడేలా తగు చర్యలు తీసుకోవాలని ఆక్రమణదారుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.






# చందనపల్లిలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు యువకులు మృతి

నల్లగొండ బ్యూరో, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)

నల్గొండ మండలం చందనపల్లి గ్రామంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. ఇంటర్ పరీక్ష రాయాలనే ఆశతో బయలుదేరిన ఇద్దరు యువకులు మార్గమధ్యంలోనే మృతిచెందారు. శాలిగౌరారం మండలం బండమీది గూడెం గ్రామానికి చెందిన గైగుల్ల వంశీ (20), ఉట్కూర్ గ్రామానికి చెందిన గుడిసె రవి (20) స్ప్లెండర్ ప్లస్ బైక్ పై నల్గొండకు వస్తుండగా, చందనపల్లి వద్ద ఎదురుగా వచ్చిన ఎస్‌పిఆర్ స్కూల్‌కు చెందిన బస్సు అకస్మాత్తుగా యూ-టర్న్ తీసుకోవడంతో ఘోర ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. బైక్‌ను ఢీకొట్టిన బస్సు కారణంగా ఇద్దరు యువకులు తీవ్ర రక్తగాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇంటర్ పరీక్ష రాయడానికి వెళ్లిన ఇద్దరు విద్యార్థులు ఇలా మధ్యలోనే ప్రాణాలు కోల్పోవడం ప్రతి ఒక్కరినీ కలచివేసింది.తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి ఎదగాలని కలలు కన్న కుటుంబాలకు ఈ ఘటన పెద్ద దెబ్బగా మారింది. ప్రైవేట్ స్కూల్ బస్సులు రోడ్లపై అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు బలైపోతున్నాయనే విమర్శలు మళ్లీ వెల్లువెత్తుతున్నాయి. వంశీ తండ్రి లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నల్గొండ రూరల్ ఎస్ఐ సైదా బాబు తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, మృతుల కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# ఇంటర్ విద్యార్థిల ప్రాణాలు తీసిన ఎస్‌పిఆర్ స్కూల్‌ను సిజ్ చేయాలి

### ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్

నల్లగొండ బ్యూరో, మార్చి 2 (వార్తా వేదిక సూర్య )




భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్ ఖమ్మం పాటి శంకర్ మాట్లాడుతూ.. ఇంటర్ పరీక్షలు రాయడానికి వస్తున్న ఇద్దరు విద్యార్థులు ఎస్పీఆర్ స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యానికి బలి కావడం బాధాకరం. తక్షణమే నల్గొండ పట్టణంలోని ఎస్పిఆర్ స్కూల్ ను సీజ్ చేసి మరణించిన విద్యార్థుల ను ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలో ఎస్పిఆర్ స్కూల్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలకు విరుద్ధంగా పాఠశాలలను నడుపుతూ, విద్యాప్రామాణాలు తుంగలో తొక్కి విద్యార్థుల మానసికతను దెబ్బ తీయడమే గాక సోమవారం ఇంటర్ విద్యార్థుల ప్రాణాలు తీసేదాకా రావడం దూరదృష్టకరం అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మరణించిన విద్యార్థుల కుటుంబాలకు 50 లక్షల ఎక్స్రేషియా ఇవ్వాలని ఎస్పిఆర్ స్కూల్ యాజమాన్యం ఆ విద్యార్థుల తల్లిదండ్రులకు తగిన పారితోషికం అందించే విధంగా పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నల్గొండ జిల్లా లో ఇటీవల కాలంలో స్కూల్ బస్సు ప్రమాదాలలో విద్యార్థులు మరణిస్తా ఉంటే నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వుండాల్సిన బస్సు డ్రైవర్ ల నిర్లక్ష్యాని కి పిల్లల ప్రాణాలు గాలిలో కలుస్తున్న పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ఇప్పటికైనా ఎస్పీ ఆర్ స్కూల్ ను సీజ్ చేయాలని లేని పక్షంలో ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.





# ఘనంగా దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు

**నల్లగొండ బ్యూరో, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)**

12వ బెటాలియన్, అన్నేపర్తిలో శ్రీ దుద్దిళ్ల శ్రీపాద రావు 92వ జయంతి వేడుకలను కమాండెంట్ కె. వీరయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ కె. వీరయ్య మాట్లాడుతూ, మంథని శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి శ్రీపాదరావు విజయం సాధించినట్లు తెలిపారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో మూడు సార్లు శాసనసభ్యుడిగా ఎన్నికై, అన్ని పార్టీల మద్దతుతో శాసనసభ స్పీకర్‌గా పదవిని అలంకరించారని పేర్కొన్నారు. ఆ పదవికి ఆయన గౌరవం తీసుకువచ్చారని రాజకీయ ప్రముఖు లు, విశ్లేషకుల ప్రశంసలు పొందినట్లు తెలిపారు. స్పీకర్ పదవిని బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ, తన నియోజకవర్గ ప్రజలతో సన్నిహితంగా ఉండి అభివృద్ధిపై దృష్టి సారించారని కొనియాడారు. విమర్శలను పట్టించుకోకుండా, ప్రశంసలకు లొంగకుండా ప్రజాసేవలో ముందుకు సాగిన మహనీయుడని పేర్కొన్నారు. మహానుభావుల జీవితాలు సమాజానికి మార్గదర్శకమని, వారి త్యాగం, క్రమశిక్షణ, సేవాభావాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. యువత సత్సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు సిహెచ్ ఆంజనేయ రెడ్డి, నర్సింగ్ వెంకన్న, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం 2005ను సమర్థవంతంగా అమలు చెయ్యాలని కలెక్టర్‌కు వినతి

డా.యర్రమాద కృష్ణారెడ్డి

**నల్లగొండ బ్యూరో, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)**

సమాచార హక్కు చట్టం 2005 ను సమర్థవంతంగా అమలు చెయ్యాలని డా. యర్రమాద కృష్ణారెడ్డి కలెక్టర్ కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు బోర్డులను పూర్తి వివరాలతో అప్ డేట్ చేసి పూర్తి సమాచారం ఉండేలా,అధికారుల పేర్లు,హోదా,సెల్ నెంబర్ లు ఉండేలా సెక్షన్ 4(3) ప్రకారంగా తెలుగులో బుక్ లెట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అదేవిధంగా ఆర్ టి ఐ జిల్లా మానిటరింగ్ కమిటీ ను ఏర్పాటు చేయాలని అన్నారు.సమాచార హక్కు చట్టం- 2005 ప్రకారంగా ప్రభుత్వ కార్యాలయాల్లో రిజిస్టర్ 1, రిజిస్టర్ 2 లను, త్రైమాసిక రిపోర్టులను సమగ్రంగా పూర్తి వివరాలతో నిర్వహించాలని అన్నారు. సమాచారం కోరిన దరఖాస్తుదారులకు సకాలంలో, గడువు లోపల 30 రోజుల్లో లోపల సమాచారం ఇచ్చేలా సంబంధిత సిబ్బందికి తగిన ఆదేశాలు ఇవ్వాలన్నారు. సమాచార హక్కు చట్టం- 2005 సెక్షన్ 5(3) ప్రకారంగా దరఖాస్తుదారులకు సహేతుకంగా పౌర సమాచార అధికారులు, సహాయ పౌర సమాచార అధికారులు సహకరించి సమాచారాన్ని వీలైనంత త్వరగా ఇచ్చేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. సమాచార హక్కు చట్టం- 2005 పారదర్శకతకు, జవాబుదారితనంను, నిబంధనలు, చట్టాలను, శాఖ అధికారులు ఆదేశాలను అనుసరించి చేసిన ఎంపికలు, తీసుకున్న నిర్ణయాల విషయంలో సమాచారం కోరిన పౌరులకు సమాచారమును తెలుపు ప్రతులు తప్పనిసరిగా ఇచ్చేలా ఆదేశించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోగరి రామక్రిష్ణ రాష్ట్ర కార్యదర్శి, బైరు సైదులు గౌడ్ జిల్లా అధ్యక్షులు, చిత్రం శ్రీనివాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, తుంగతుర్తి రామక్రిష్ణ, బాలకృష్ణ, యాదగిరి, ఎంకన్న, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# చెట్టును ఢీకొన్న బైకు.. ఇద్దరు మృతి

**అదిలాబాద్, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)**

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ధనోర (బి) రహదారి మూల మలుపు వద్ద చెట్టును బైకు ఢీకొట్టింది. ఘటనలో ఓ మహిళ, ఓ యువకుడు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని సిపిఆర్ చేసి ప్రాణాలు రక్షించే ప్రయత్నం చేసారు. ప్రమాద స్థలం వద్దకు ఇంద్రవెల్లి పోలీసులు చేరుకున్నారు. . కేసు నమోదు చేసి దర్యాప్తు. పోస్ట్ మార్టం నిమిత్తం మృత దేహాలను ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మూల మలుపు దగ్గర తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు.

# ఆలయ నిర్మాణానికి 50 లక్షలు విరాళామందించిన బీఆర్ఎస్ నేత



**పటాన్‌చెరు, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)**

కన్నవారు, పుట్టిన ఊరు నాకేమిచ్చిందని నిట్టూరుస్తున్న ఈ రోజుల్లో.. తల్లిదండ్రులకు గౌరవం తెచ్చే విధంగా బ్రతకాలి. పుట్టిన ఊరుకు చేతనైయినంత వరకు సాయం చేయాలి అనే దృఢ సంకల్పంతో సొంత ఊరికి, నిరుపేదలకు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న బిఆర్ఎస్ నేత, రాజ్ కుమార్ ఫౌండేషన్ చైర్మన్ కాల్వగడ్డ రాజ్ కుమార్ మరోసారి హాట్ టాపిక్ గా వార్తల్లో నిలిచారు. పఠాన్ చెరువు నియోజకవర్గం, ముత్తంగి డివిజన్, కర్ధనూర్ గ్రామంలో పురాతన శ్రీ సిద్ధి వినాయక స్వామి ఆలయం ఎంతో పురాతనమైనది, వందల ఏళ్ళ చరిత్ర కలిగి ఉన్నప్పటికీ అభివృద్ధికి నోచుకోక శిదిలావస్థకు చేరుకుంటున్న తరుణంలో దాతల కోసం ఆలయ సిబ్బంది, గ్రామస్థులు ఎంతమందిని కలుస్తున్నా పెద్దగా స్పందన లభించకపోవడంతో గ్రామస్థులు నిరూత్సహానిక గురవుతున్నారు. దీంతో ఎక్కడి ఆలయ పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. యూకేజీ నుండి 9 వ తరగతి వరకు చదివిన కర్దనూరు గ్రామం తనకు సొంత గ్రామం లాటిందని.. చరిత్ర కలిగిన సిద్ధి వినాయక ఆలయ పునర్నిర్మాణం కోసం గ్రామస్థులతో పాటు ఆలయ నిర్మాణం బాధ్యతలో నేను సైతం చేయికలుపుతానంటూ రాజ్ కుమార్ ఫౌండేషన్ చైర్మన్ కాల్వగడ్డ రాజ్ కుమార్ ముందుకొచ్చారు. దానంలో కర్ణుడే ఆదర్శం అన్నట్లు ఏకంగా 50లక్షల విరాళాన్ని ప్రకటించి రాజ్ కుమార్ హాట్ టాపిక్ గా నిలిచారు. తక్షణమే ఆలయ పనులు మొదలు పెట్టాల్సిందిగా ఆలయ కమిటీ సభ్యులకు రాజ్ కుమార్ సూచించారు. రాజ్ కుమార్ తీసుకున్న నిర్ణయం పట్ల పార్టీలకు అతీతంగా ప్రశంసలు కురిపిస్తున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల కోసం వసూళ్లకు పాల్పడ్డ కాంగ్రెస్ నేత.. కేసు నమోదు

**వికారాబాద్, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)**

వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తానని, టీపీసీసీ కో-ఆర్డినేటర్ ధారా భాస్కర్ రూ.లక్ష డిమాండ్ చేశాడని గూళ్ళ కేశవులు అనే వ్యక్తి ఆరోపించాడు.

గత ఏడాది రూ.50 వేలు వసూలు చేశాడని, మిగతా రూ.50 వేలు ఇవ్వాలని బెదిరిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసాడు. పోలీసులు బాధితుడి ఫిర్యాదు మేరకు ధారా భాస్కర్పై కేసు నమోదు చేసారు.

### ఘనంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు, చౌటుప్పల్ అంబేద్కర్ ట్రస్ట్ చైర్మన్

# బోయ రామచందర్ జన్మదిన వేడుకలు

**చౌటుప్పల్, మార్చి 2 వార్త వేదిక సూర్య**

ఎమ్మార్పీఎస్ చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఎమ్మార్పీఎస్ తొలితరం నాయకుడు ప్రస్తుత చౌటుప్పల్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ బోయ రామచందర్ జన్మదిన వేడుకలు మార్కెట్ యార్డులో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య పాల్గొని మాట్లాడుతూ ఈ ప్రాంతంలో దళిత ఉద్యమాల లో బోయ రామచందర్ పాత్ర చాలా కీలకమైనది ఇలాంటి వ్యక్తులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో కలకాలం పాటు వర్ధిల్లాలని దళిత సమాజానికి మరింత సేవ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బొడ్డు శ్రవణ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు చిమకండ్ల శ్రీనివాస్, మున్సిపాలిటీ అధ్యక్షులు ఎర్ర శంకర్, మాజీ ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు సుక్క అర్జున్, సామాజిక ఉద్యమకారుడు కట్టెల లింగస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండు మల్లయ్య, అగ్రికల్చర్ ఏవో నాగరాజు, బోయ సృజన్ భరద్వాజ్, నిమ్మల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.





# ఏపీలో కొత్త రాజకీయ పార్టీ

**విజయవాడ, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో రెడ్డి సామాజిక వర్గం కొత్త రాజకీయ వేదిక కోసం ఆలోచిస్తున్నదా అనే ప్రశ్న తాజాగా చర్చకు వస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి తమకు ప్రత్యేక రాజకీయ పార్టీ అవసరమనే భావన కొంతమంది నేతల్లో బలపడుతున్నట్టు సమాచారం. ఈ దిశగా రాష్ట్రంలోని సీమ ప్రాంతం తో పాటు నెల్లూరు ప్రాంతానికి చెందిన నాయకులు చర్చలు జరుపుతున్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రెడ్డి వర్గం పెద్దఎత్తున మద్దతు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే తరువాతి కాలంలో తమకు తగిన ప్రాధాన్యం దక్కలేదనే భావన ఆ వర్గంలో పెరిగిందని అంటున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో రెడ్లకు ఇవ్వాల్సిన అవకాశాలు ఇతర వర్గాలకు కేటాయించారనే అసంతృప్తి వ్యక్తమైంది. అలాగే పరిశ్రమలు, వ్యాపార రంగాల్లో ఉన్న ప్రముఖులను కూడా ప్రభుత్వం ప్రోత్సహించలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.2024 ఎన్నికల ఫలితాల తర్వాత పరిస్థితి మరింత మారిందని విశ్లేషకులు అంటున్నారు. పార్టీ ఓటమి అనంతరం రెడ్డి వర్గంతో ప్రత్యేక సమావేశాలు జరగకపోవడం, వారి సమస్యలపై చర్చలు లేకపోవడం అసంతృప్తికి దారితీసిందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తమకు సొంత రాజకీయ వేదిక ఉండాలనే ఆలోచన కొంతమంది నాయకుల్లో బలపడుతోంది.మరోవైపు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిల వైపు కూడా కొంత ఆశతో చూసినప్పటికీ, ఆమె రాజకీయ వ్యూహాలు భిన్నంగా ఉండటంతో పెద్దగా ఆకర్షణ కలగలేదని అంటున్నారు. తెలుగుదేశం పార్టీలో కూడా రెడ్డి వర్గానికి ప్రాధాన్యం ఉందని చెప్పినా, క్షేత్రస్థాయిలో ఆశించినంత స్థాయి లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారతీయ జనతా పార్టీ పై హిందుత్వ ముద్ర ఉండటంతో అందరూ ఆ దిశగా వెళ్లడం లేదని చెబుతున్నారు. జనసేన పార్టీ విషయంలో కూడా పెద్ద ఎత్తున మద్దతు కనిపించడం లేదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.ఈ పరిణామాల మధ్య తెలంగాణ లో నివసిస్తున్న ఏపీకి చెందిన రెడ్డి నాయకులతో కూడా సంప్రదింపులు జరుగుతున్నట్టు సమాచారం. త్వరలో హైదరాబాద్ లో విస్తృత స్థాయి చర్చలు నిర్వహించే ఆలోచన ఉందని చెబుతున్నారు. రాజశేఖర్ రెడ్డి నాయకత్వం కింద రెడ్డి సామాజిక వర్గమంతా పనిచేసింది. దీంతో 2004లో తొలిసారిగా అధికారంలోకి వచ్చింది. 2009లో సైతం రెండోసారి అధికారం చేపట్టింది కాంగ్రెస్ పార్టీ. దానికి ముమ్మాటికి కారణం రెడ్డి సామాజిక వర్గం మద్దతు. రాజశేఖర్ రెడ్డి మరణంతో రెడ్డి సామాజిక వర్గమంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గూటికి చేరింది. ఆ సామాజిక వర్గమంతా జగన్మోహన్ రెడ్డిని ఓన్ చేసుకున్నారు. కానీ ఆయన అనుకున్న స్థాయిలో రెడ్డి సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. రెడ్డి సామాజిక వర్గం నియోజకవర్గాల్లో సైతం ఇతరులకు అవకాశాలు కల్పించారు జగన్మోహన్ రెడ్డి. తన ఐదేళ్ల పాలనలో రెడ్డి సామాజిక వర్గానికి ప్రత్యేకంగా ఒనగూరే ప్రయోజనాలు లేకుండా పోయాయి. దీంతో ఆ సామాజిక వర్గం మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సహాయ నిరాకరణ చేసింది.అయితే ఓటమి తర్వాత కూడా జగన్మోహన్ రెడ్డి వైఖరిలో మార్పు రావడం లేదు. రెడ్డి సామాజిక వర్గం విషయంలో ప్రత్యేక ఆలోచనలు చేయడం లేదు. ఈ పరిస్థితుల్లో తమకోసం ఒక ప్రత్యేక రాజకీయ పార్టీ ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి రెడ్డి సామాజిక వర్గం ప్రముఖులు వచ్చినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ వేదికగా ఇందుకు సంబంధించి సన్నాహక సమావేశాలు నిర్వహించేందుకు రెడ్డి సామాజిక వర్గం ప్రముఖులు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఒక ప్రత్యేక అజెండాతో ముందుకు సాగుతూ.. ఎన్నికల సమయానికి కలిసివచ్చే రాజకీయ పార్టీలతో ముందడుగు వేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే రెడ్డి సామాజిక వర్గానికి సంబంధించి రాజకీయ పార్టీ ఏర్పాటుకు మరికొద్ది నెలలో ఒక తుది రూపు వచ్చే అవకాశం ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?కానీ రెడ్డి సామాజిక వర్గంలో జరుగుతున్న చర్చలు మాత్రం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఒకవేళ ఆ వర్గం ఏకమై కొత్త దిశగా అడుగులు వేస్తే, అది ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# ఈరోజు కామ దహనం రేపు హోలీ పండుగ!

### స్థానిక పురోహితుల సూచన మేరకు, హోలీ పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

### చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్



**చౌటుప్పల్, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)**

చౌటుప్పల్ మున్సిపల్ ప్రజలు హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని చౌటుప్పల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ గారు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోలీ పండుగను పురస్కరించుకొని పట్టణ ప్రజలకు మున్సిపాలిటీ పాలకవర్గం తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలందరూ పండుగను ప్రశాంత వాతావరణంలో సంప్రదాయాల నడుమ, ఎలాంటి అవాంఛనీయ చోటుచేసుకోకుండా సూచించారు. సంఘటనలు నిర్వహించుకోవాలని ముఖ్యంగా పట్టణ ప్రజలు సురక్షితమైన సహజ రంగులను వాడి పండుగను నిర్వహించుకోవాలని, రసాయన రంగులను ఉపయోగించవద్దని పేర్కొన్నారు. యువత హోలీ పండుగ అనంతరం చెరువుల్లో లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు ఆచరించే క్రమంలో జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి అని సూచించారు. ముఖ్యంగా యువత తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ వారికి సరైన పద్ధతి ని తెలియజేయాలని సూచించారు. తెలియని వారిపై రంగులు చల్లవద్దని చైర్ పర్సన్ పావని రమేష్ గౌడ్ గారు సూచించారు.

# ఫేక్ షాపింగ్ వెబ్‌సైట్లతో ప్రజలు మోసపోవద్దు

### సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

### పత్తికొండ రూరల్ సీఐ పులి శేఖర్ గౌడ్

**పత్తికొండ/తుగ్గలి, మార్చి 2 (వార్తా వేదిక సూర్య) :**




ఫేక్ షాపింగ్ వెబ్ సైట్లతో మోసపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పత్తికొండ రూరల్ సీఐ పులి శేఖర్ గౌడ్ తెలియజేశారు. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ పులిశేఖర్ గౌడ్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆన్లైన్ షాపింగ్ పేరుతో నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి సైబర్ నేరగాళ్ళు ప్రజలను మోసం చేసే సంఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ తెలియజేశారు.కొంతమంది సైబర్ నేరగాళ్లు ప్రసిద్ధి చెందిన కంపెనీల పేర్లతో పోలి ఉండే వెబ్‌సైట్లు రూపొందించి,భారీ డిస్కౌంట్లు,ప్రత్యేక ఆఫర్లు,తక్కువ ధరలకు ఎలక్ట్రానిక్ వస్తువులు,మొబైల్ ఫోన్లు, గృహోపకరణాలు అందిస్తామని ప్రచారం చేస్తున్నారు.ఆ వెబ్‌సైట్ల ద్వారా ముందస్తు చెల్లింపులు తీసుకుని తర్వాత వస్తువులు పంపకుండా మోసం చేస్తున్నట్లు గుర్తించామని ఆయన ప్రజలకు తెలియజేశారు.ఈ సందర్భంగా సిఐ ప్రజల కొరకు పలు ముఖ్యమైన సూచనలను తెలియజేశారు.అందులో ముఖ్యంగా అధికారిక వెబ్‌సైట్లలో మాత్రమే వస్తువులను కొనుగోళ్లు చేయాలని, వెబ్‌సైట్ నందు యుఆర్ఎల్ సరిగా ఉందో లేదో పరిశీలించాలని,అతి తక్కువ ధరలకు వస్తువులు అందిస్తామని చెప్పే ప్రకటనలను ప్రజలు నమ్మకూడదని,బ్యాంక్ వివరాలు,కార్డ్ వివరాలు మరియు ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా ఉండాలని,సాధ్యమైనంత వరకు "క్యాష్ ఆన్ డెలివరీ"ఎంపికను ఉపయోగించాలని,ఆన్లైన్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలకు తెలియజేశారు. ప్రజలు వెంటనే ఫిర్యాదు చేస్తే మోసపోయిన మొత్తాన్ని తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.ప్రజల సహకారంతోనే సైబర్ నేరాలను అరికట్టగలమని పత్తికొండ రూరల్ సీఐ పులి శేఖర్ గౌడ్ తెలియజేశారు.

# అరుణకుమారి బోధిస్తున్న తీరు ప్రశంసనీయం

**అమరావతి, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)**

శ్రీకాకుళం జిల్లా, జి. సిగడాం మండలం, పున్నాం పంచాయతీ బూటుపేట ప్రాథమిక పాఠశాల లో ప్రధానోపాధ్యాయినిగా విధులు నిర్వర్తిస్తున్న కూర్మాన అరుణకుమారి టీచర్ సృజనాత్మకంగా బొమ్మలు, షార్ట్ ఫిల్మ్స్, వర్కింగ్ మోడల్స్తో పాఠాలను పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్న తీరు ప్రశంసనీయమని మంత్రి లోకేష్ కొనియాడారు.గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ్, రాష్ట్ర--జాతీయ స్థాయి విద్యా శిక్షణల్లో కేఆర్పీగా, మాడ్యూల్ రచయితగా, ఈ--కంటెంట్ సృష్టికర్తగా అరుణ కుమారి టీచర్ ఎనలేని కృషి చేస్తున్నారు. ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ లక్ష్యానికి మీరంతా స్ఫూర్తి ప్రదాతలని అన్నారు.

# కరెంట్ షాక్ తప్పదా




**హైదరాబాద్, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)**

వేసవి తాపం మొదలవడంతో ఇళ్లలో ఏసీలు, కూలర్ల వాడకం క్రమంగా పెరుగుతోంది. అయితే విద్యుత్తును విచ్చలవిడిగా వాడితే నెలాఖరులో భారీ బిల్లులు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రభుత్వ 'గృహజ్యోతి' పథకం వర్తించాలంటే నెలకు 200 యూనిట్ల లోపే వినియోగం ఉండాలి. ఒక్క యూనిట్ ఎక్కువైనా ఈ పథకం వర్తించదు కాబట్టి, వినియోగదారులు పొదుపు మంత్రం పాటించడం ఎంతో ముఖ్యం.పాతకాలపు ఫ్లోరిసెంట్ ట్యూబ్‌లైట్లకు బదులుగా ఎల్ఈడీ (రాజుణ) బల్బులను వాడటం వల్ల విద్యుత్ ఖర్చు తగ్గుతుంది.ఏసీ ఉష్ణోగ్రతను ఎప్పుడూ 24 నుంచి 26 డిగ్రీల మధ్య ఉంచాలి. ఇన్వర్టర్ ఏసీలు వాడటం వల్ల గది చల్లబడగానే అవి ఆటోమేటిక్‌గా ఆగిపోయి విద్యుత్తును ఆదా చేస్తాయి. వేసవి ప్రారంభానికి ముందే ఏసీలను మెకానిక్‌తో తనిఖీ చేయించడం మంచిది.ఫ్రిజ్లు, ఏసీలు, ఫ్యాన్లు కొనేటప్పుడు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఇచ్చే 5 స్టార్ రేటింగ్ ఉన్న పరికరాలను ఎంచుకుంటే బిల్లు తక్కువగా వస్తుంది.అవసరం లేనప్పుడు టీవీలు, కంప్యూటర్లు, ఫ్యాన్లను ఆపివేయాలి. మొబైల్ ఛార్జింగ్ పూర్తయ్యాక ప్లగ్ నుంచి ఛార్జర్‌ను తప్పనిసరిగా తొలగించాలి. రిఫ్రిజిరేటర్లలో సీజన్‌ను బట్టి ఫ్రీజర్ సెట్టింగ్స్ మార్చుకుంటూ ఉండాలి.



## హెూం గార్డ్స్‌కు చెక్కులు అందజేత

**కర్నూలు, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)**

హోం గార్డ్స్ సెంట్రల్ వెల్ఫేర్ ఫండ్ నుండి మంజూరైన చెక్కులను జిల్లా పోలీసు కార్యాలయంలోని హోంగార్డు కమాండెంట్ కార్యాలయంలో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ యం. మహేష్ కుమార్ లబ్ధిదారులకు అందజేశారు. సోవారం నాడు హోం గార్డ్స్ సెంట్రల్ వెల్ఫేర్ ఫండ్ నుండి మంజూరైన మొత్తం రూ. 50,000/- విలువైన చెక్కులను ఐదుగురు హోం గార్డ్స్ సభ్యులకు పంపిణీ చేసారు. ఇందులో లిఇద్దరికి మ్యారేజ్ గ్రాంట్‌లి క్రింద చెరొకరు రూ. 5,000/- చొప్పున, మిగిలిన ముగ్గురికి చెరొకరు రూ. 10,000/- చొప్పున లిమెడికల్ గ్రాంట్‌లి క్రింద అందజేసారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ కె. మాధవి రాణి, పోలీసు సిబ్బంది మరియు హోం గార్డ్స్ పాల్గొన్నారు.

## మెడికల్ మాఫియాని అరికట్టాలి

**బోగస్ మెడిసిన్స్ ను తయారు చేస్తున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలి**

**మామూళ్ల మత్తులో డ్రగ్స్ అధికారులు**

**ప్రభుత్వం బాధ్యత వహించి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలి**

**సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి డిమాండ్**

**తిరుపతి, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)**


రాష్ట్రంలో మెడికల్ మాఫియా ను అరికట్టి బోగస్ మందులు తయారు చేస్తున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి డిమాండ్ చేశారు. ఈరోజు ఉదయం 10 గంటలకు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ )ఆధ్వర్యంలో ఔషధ నియంత్రణ మండలి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా పి మురళి మాట్లాడుతూ ప్రజలకు మొదట ప్రాధాన్యత ఇచ్చి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలు అవినీతికి కూరకపోయి విచ్చలవిడిగా మెడికల్ మాఫియా కు పరిమిషన్లు ఇచ్చి భోగస్ మందులు పంపిణీ చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని వాపోయారు. రాష్ట్రంలో చదువుకున్న ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా, వారి పట్టాలకు బ్యాంకు లోన్లు ఇచ్చి ప్రభుత్వ నిబంధనల ప్రకారం మందుల షాపులు నడపవలసిన ప్రభుత్వం నేడు విచ్చలవిడిగా ఫార్మసీ విద్యార్థుల సర్టిఫికెట్లు కు నెలకు 3000 రూపాయలు చెల్లించి వీధి వీధికి కార్పొరేట్ మెడికల్ స్టోర్లు విచ్చలవిడిగా వచ్చేశాయని, ఆ కంపెనీ మెడికల్ స్టోర్ పేరుతోనే మందులు తయారు చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ హాస్పిటల్ కి వెళితే మెడికల్ టెస్ట్ లు పేరుతో, జబ్బుకు సంబంధం లేని మందులు కూడా రాసిస్తున్నారని, ఆ మందులు హాస్పిటల్ లో ఉన్న మెడికల్ స్టోర్ లోనే తీసుకోవాలని, బయట మెడికల్ స్టోర్ లో ఎక్కడ దొరకవు అని కోట్ల రూపాయలకు ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్ యాజమాన్యం దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ల్యాండ్ మాఫియా, మైనింగ్ మాఫియా కంటే మెడికల్ మాఫియా జాబితాలోకి మెడికల్ అండ్ ఫార్మా చేరి నకిలీ మందులు, నకిలీ డాక్టర్లు, నకిలీ ఆసుపత్రులు, నకిలీ సిబ్బందితో అవసరం లేని మందులు ప్రజలకు ఇచ్చి ప్రజా ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత విద్య వైద్యం కి ఇవ్వాల్సిన బాధ్యత ఉందని, తక్షణమే జోక్యం చేసుకొని మామూలు కలవాటు పడిన డ్రగ్స్ అధికారులపై చర్యలు తీసుకొని, మెడికల్ మాఫియాని అరికట్టాలని కోరారు. మెడికల్ మాఫియా పై చర్యలు తీసుకొని ఎడల సిపిఐ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కే రాధాకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి,నగర సహాయ కార్యదర్శి బండి చలపతి, నగర కార్యవర్గ సభ్యులు ఉదయ్ కుమార్, ఎన్ శివ, ఎన్ డి రవి, కే వై రాజా, జింక నాగరాజు, మహేంద్ర, పద్మనాభ రెడ్డి, శ్రీరాములు, రామకృష్ణ, కాలయ్య,విజయ, రామచంద్ర, శ్రీనివాస్, ప్రమీల, ప్రవీణ్, ఏపీ బాల, మునీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ పార్టీకి వరుస కష్టాలు



**విజయనగరం, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)**

వైసీపీ పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో నేనున్నాను అంటూ ముందుకు వచ్చారు రాజశేఖర్ రెడ్డి. అప్పటివరకు కాంగ్రెస్ పార్టీలో ఎంతోమంది నేతలు ఉన్నారు. అందులో రాజశేఖర్ రెడ్డి ఒకరు. పార్టీలో సైతం చాలా పదవులు చేపట్టారు. అయితే తెలుగుదేశం పార్టీ ప్రాబల్యం పెరుగుతున్న క్రమంలో.. ఎలాగైనా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలన్న కసి నాయకుల్లో ఉండేది. దానిని గుర్తించారు రాజశేఖర్ రెడ్డి. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి జిల్లా నుంచి చురుకైన నాయకులను గుర్తించారు. అలా పుట్టుకొచ్చిన వారే ఒక బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, కొణతాల రామకృష్ణ వంటి నేతలు. అయితే కార్యక్రమంలో ఎటువంటి నేతలంతా జగన్మోహన్ రెడ్డి కొడుకు కిందకు చేరారు. కానీ వారిని సరిగ్గా సద్వినియోగం చేసుకోలేకపోయారు జగన్మోహన్ రెడ్డి. ప్రస్తుతం ఉత్తరాంధ్రలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. పార్టీని నడిపే నాయకుడు కూడా లేరు. బొత్స సత్యనారాయణ లాంటి బీసీ నేత జగన్మోహన్ రెడ్డికి ఒక రక్షణ వలయంగా నిలిచారు. అయితే దానిని గుర్తించిన జగన్మోహన్ రెడ్డి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఆయనకు అవకాశం ఇచ్చారు. మండలిలో వైసీపీ పక్ష నేతగా కూడా ఛాన్స్ కల్పించారు. తనకున్న పాత పరిచయాల ద్వారా ఉత్తరాంధ్రలో పార్టీని బలోపేతం చేసే పనిలో పడ్డారు బొత్స. అయితే ఈ క్రమంలో బొత్స అనారోగ్యానికి గురికావడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పెద్ద షాక్. ఆ స్థాయిలో ఇప్పుడు ఎవరు పనిచేస్తారు అనేది ఒక ప్రశ్న. రకరకాల పేర్లు తెరపైకి వచ్చినా.. బొత్స స్థాయిలో ప్రభావం చూపే నేతల మాత్రం ఎంత మాత్రం లేరని చెప్పవచ్చు.ప్రస్తుతం ఉత్తరాంధ్రలో పెద్దదిక్కుగా ఉన్నారు ధర్మాన ప్రసాదరావు . సుదీర్ఘకాలం ఆయన శ్రీకాకుళం జిల్లా నుంచి మంత్రిగా పనిచేశారు. మొన్నటి ఎన్నికల్లో ఓ సాధారణ సర్పంచ్ చేతిలో ఓడిపోయారు. అది కూడా దారుణంగా 52 వేల ఓట్ల తేడాతో. ఆయన గెలిచినప్పుడు మాత్రం చాలా తక్కువ మెజారిటీతో బయటపడుతున్నారు. పైగా మునుపటి మాదిరిగా ధర్మాన దూకుడుగా వ్యవహరించలేకపోతున్నారు. ఆయన కేవలం శ్రీకాకుళం జిల్లా నేత మాత్రమే. ఉత్తరాంధ్ర పై ప్రభావం చూపేటంత శక్తి, బలం లేదన్నది ఒక బహిరంగ రహస్యం. ఆయన తమ్ముడు కృష్ణ దాస్ పరిస్థితి కూడా అంతే. పోనీ తమ్మినేని సీతారాం ద్వారా ప్రయత్నాలు చేద్దాము అంటే ఆయన వాగ్దాటి వరకే పరిమితం. కేవలం శ్రీకాకుళం జిల్లా వరకే ఆయన పేరు ప్రముఖంగా వినిపిస్తూ ఉంటుంది. డాక్టర్ సీదిరి అప్పలరాజు, గుడివాడ అమర్నాథ్ వంటి నేతలు ఉన్న ఎంత మాత్రం ప్రభావం చూపలేరు. అయితే ఇప్పుడు బొత్స కు అనారోగ్యం కావడంతో ఏదో ఒక నాయకుడికి ఇప్పుడు బొట్టు పెట్టాల్సిందే. లేకుంటే మాత్రం ఉత్తరాంధ్రలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలపడే అవకాశాలు సన్నగిల్లుతాయి.







# మోదుగు పూలతో రంగుల తయారీ చేసుకోండి

**హోలీలో సహజ సిద్ధ రంగులను వాడండి**

**వింజమూరి చంద్రమౌళి**

**దేవరకొండ, ఫిబ్రవరి 2 (వార్త వేదిక సూర్య ):**

ప్రతి హోలీ కి మోదుగు పూలు విరివిగా పూస్తాయని మోదుగు పూలతో హోలీ రంగులు తయారు చేసుకుని ఆడాలన్న నానుడి ఆనాడు నుండి కొనసాగుతుంది. హిందూ సంప్రదాయ ప్రకారం ప్రతి సంవత్సరం నిర్వహించే హోలీ పండుగలో సహజ సిద్ధ రంగులను వాడాలని గాయత్రి పరివార్ కొండమల్లేపల్లి నిర్వాహకులు వింజమూరు చంద్రమౌళి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ చందనం ఉపయోగించి హోలీని ఆడడం వలన మేలు జరుగుతుందని, ఎలాంటి నష్టం జరగదు అన్నారు.

పాశ్చాత్య మోజులో పడి యువత కెమికల్స్ తో కూడిన రంగులను ఉపయోగించడం వలన చర్మ సంబంధ వ్యాధులు ప్రబులుతాయని, కళ్ళల్లో పడితే కళ్ళు పోయే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. సహజ సిద్ధ రంగులైన చందనం, కుంకుమ, పసుపు తో పాటు ప్రతి హోలీకి ఆకులు కనబడకుండా పువ్వులే కనపడే మోదుగు పూలను హోలీకి ప్రత్యేకంగా ఉపయోగించాలని ఆయన సూచించారు.

బీట్రూట్ తో కూడా రంగులు తయారు చేసుకోవచ్చన్నారు. ఏది ఏమైనా సహజ సిద్ధ రంగులు ఉపయోగించి హోలీ ఆడడం శ్రేయస్కరమని అన్నారు.

## ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల్లో ప్రజల సానుకూలత పెంపొందించాలి

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




**నంద్యాల, మార్చి 2 (వార్తా వేదిక సూర్య) :**

ప్రభుత్వం చేపట్టిన ప్రాధాన్యత పథకాల అమలులో జిల్లాలో సానుకూలత శాతాన్ని పెంపొందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ఫిర్యాదు దారుల నుండి అర్జీలు స్వీకరించిన అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్ఓ రామునాయక్ అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత పథకాల అమలులో జిల్లాలో ప్రజల సానుకూలత శాతాన్ని పెంచే దిశలో చురుకుగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం, భద్రత, మౌలిక వసతుల విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది చేసిన తప్పులకు జిల్లా స్థాయి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టమైన సంకేతాలు ఇచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు. “కింది స్థాయి సిబ్బంది చూసుకోలేదు” అని చెప్పి బాధ్యత నుంచి తప్పించుకునే అవకాశం లేదని స్పష్టం చేశారు. ప్రతి జిల్లా అధికారి తన శాఖ పనితీరును సమగ్రంగా పర్యవేక్షించాల్సిన బాధ్యత కలిగి వుండాలని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, కాలుష్య నియంత్రణ తదితర శాఖలకు కలిగిన రెగ్యులేటరీ అధికారాలను సమర్థంగా వినియోగించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించే సంస్థలకు కేవలం నోటీసులు ఇవ్వడం సరిపోదని, అవసరమైతే సీజ్ వంటి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆళ్లగడ్డలో నిబంధనలు పాటించని ఒక ఆర్‌ఓ ప్లాంట్‌ను సీజ్ చేయడంతో పరిస్థితుల్లో మార్పు వచ్చినట్లు ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రజారోగ్య సమస్యలు ఉద్భవించే పరిస్థితుల్లో అధికారుల చర్యలు మరింత దృఢంగా ఉండాలని స్పష్టం చేశారు. ఫైర్ ఎన్‌ఓసీ జారీ విషయంలో 100 శాతం పనితీరు ఉండాలని, ఎక్కడ పరిపాలనా లోపం ఉందో గుర్తించి సరిదిద్దుకోవాలని సూచించారు. జిల్లాలోని శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, 20 శాతానికి పైగా నెగిటివిటీ ఉన్న శాఖల అధికారులు తక్షణమే కారణాలు వివరించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా ట్రాన్స్‌పోర్ట్ శాఖలో 41.7% నెగిటివిటీ నమోదైందని, వాహన్ సేవలపై సుమారు 40% ప్రతికూల అభిప్రాయం ఉందని తెలిపారు. యూరియా లభ్యతలో 38.4%, హౌసింగ్ విభాగంలో 33% నెగిటివిటీ ఉండడం ఆందోళనకరమని పేర్కొన్నారు. మైనారిటీ వెల్ఫేర్ శాఖలో 33.2% నెగిటివిటీ ఉండగా, త్రాగునీరు, వీధి దీపాల వంటి మున్సిపల్ సేవల్లో 22% నెగిటివిటీ నమోదవడం గమనార్హమని, వేసవి కాలం దృష్ట్యా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో (జీజీహెచ్) 24 శాతం నెగిటివిటీ ఉండడంపై కూడా సమీక్షించాలని పేర్కొన్నారు. వెల్ఫేర్ హాస్టళ్లలో డేటాబేస్ ప్యూరిఫికేషన్ అత్యవసరమని, పాత డేటాను తొలగించి ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల వివరాలు, తల్లిదండ్రుల మొబైల్ నంబర్లను అప్‌డేట్ చేయాలని సూచించారు. డేటా సరిచేసిన తర్వాతే పనితీరు మెరుగుపడుతుందని తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలు దిగువ స్థాయి నుంచి రెండో స్థానానికి రావడం ప్రశంసనీయం అని అభినందించారు. మైనారిటీ వెల్ఫేర్ శాఖ డేటా ప్యూరిఫికేషన్ తర్వాత మెరుగైన స్థానానికి చేరుకుందని పేర్కొన్నారు. సెర్ప్ (రాజు-క్రా) జిల్లా స్థాయిలో టాప్ పర్ఫార్మింగ్ శాఖగా నిలవడం సంతోషకరమని తెలిపారు. 70 శాతం పైగా సానుకూలత సాధించిన శాఖలను ఆదర్శంగా తీసుకొని, 30% లోపు పనితీరు ఉన్న శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మొహమాటం వల్ల విధుల్లో వెనుకడుగు వేయరాదని, ప్రజా ప్రయోజనాల విషయంలో రాజీ ఉండకూడదని అవసరమైతే కఠిన చర్యలు తీసుకోవడంలో వెనుకాడవద్దు” అని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## కలకలం రేపుతున్న డీప్ ఫేక్ వీడియోలు

**తిరుమల, మార్చి 2 (వార్తా వేదిక సూర్య) :**

సోషల్ మీడియా వేదికగా తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బి.ఆర్. నాయుడు తీవ్రంగా స్పందించారు. కొందరు వ్యక్తులు నకిలీ డీప్‌ఫేక్ వీడియోలను సృష్టించి, తన వ్యక్తిగత ప్రతిష్టను భంగపరచడమే కాకుండా, పవిత్రమైన టీటీడీ సంస్థ గౌరవాన్ని దిగజార్చేందుకు కుట్ర పన్నారని బీఆర్ నాయుడు ఆరోపించారు. ఈ మేరకు అప్రతిష్ట పాలు చేసేలా సాగుతున్న ఈ ప్రచారాన్ని అరికట్టాలని కోరుతూ ఆయన సైబర్ క్రైమ్ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు.ఆధునిక ాా× (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ తన రూపాన్ని అనుకరించేలా కృత్రిమ వీడియోలను తయారు చేశారని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మండిపడ్డారు. ఈ వీడియోల్లోని కంటెంట్ అంతా పూర్తిగా అసత్యమని, కావాలనే వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేశారు. టీటీడీ ప్రతిష్టను దెబ్బతీసేందుకు పక్కా పథకం ప్రకారం ఈ కుట్ర సాగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.నకిలీ డీప్ ఫేక్ వీడియోలతో కొందరు సోషల్ మీడియాలో నాపై దుష్ప్రచారం చేస్తున్నారు. వ్యక్తిగతంగా నన్ను అప్రతిష్ట పాలు చేసేందుకు, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను దిగజార్చేందుకు కుట్రలు చేస్తున్నారు. సాంకేతికతను వాడుకుని నా రూపం అనుకరించే విధంగా వీడియోలు తయారు చేసి ప్రచారం. ఈ దుష్ప్రచారం వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయని బి.ఆర్. నాయుడు ఆరోపించారు. ప్రధానంగా వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు తనపై ఈ తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని, దీనిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తన వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ, భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న టీటీడీ ప్రతిష్టను దెబ్బతీస్తున్న ఇటువంటి వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. సైబర్ క్రైమ్ విభాగం తన ఫిర్యాదుపై స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ నాయుడు కోరారు.డీప్ ఫేక్ కంటెంట్‌తో ప్రముఖుల జీవితాలతో ఆటాడుకునే ప్రయత్నం చేస్తున్నాయి అసాంఘిక శక్తులు. దారి తప్పిన వారి చేతుల్లోఉన్న రాజకీయ పార్టీలు ఇలాంటివి బరి తెగింపుతో చేస్తూనే ఉన్నాయి. ఇలాంటి వీడియోలు సోషల్ మీడియాలో వదిలేసి విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. కానీ వాటికి బాధ్యత తీసుకోవడంలేదు. మాకు సంబంధం లేదని.. అవి సోషల్ మీడియాలో వచ్చాయి కాబట్టే తాము ప్రచారం చేస్తున్నామని చెబుతూంటారు. అంటే వారే క్రియేట్ చేసి.. వారే తమ హ్యాండిల్స్ లో ప్రచారం చేసి. కానీ అవి సోషల్ మీడియాలో వచ్చినట్లే చెబుతూంటారు కానీ. అవి నిజమైనవే అని చెప్పరు. అలా చెబితే అది ఫేక్ అని తేలితే వారిపైనే కేసులు పడతాయి కాబట్టి.వైసీపీ ప్రధాన వ్యూహం మొదటి నుంచి ఒకటే. ఎదుటి వారిపై బురద చల్లేయడం. వారు తుడుచుకుంటూంటే. ఆనందించడం. ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపడం. ఇప్పుడు లడ్డూ కల్తీ కేసులో టీటీడీని అన్ని విధాలుగా టార్గెట్ చేస్తున్నారు. ఇప్పుడు టీటీడీ చైర్మన్ ను టార్గెట్ చేశారు. ఆ వీడియో ఫేక్ కాకపోతే నిజం అయితే వైసీపీ దీన్ని అసలైనదేనని ప్రకటించి ముందు ఉండి పోరాడాలి. సోషల్ మీడియా వెనుక దాక్కకోకూడదు. అది ఫేక్ అయితే వైసీపీనే బాధ్యత తీసుకుని కేసులను ఎదుర్కోవాలి.ఈ వీడియోతో మాకు సంబంధం లేదని.. సోషల్ మీడియాలో తిరుగుతోంది కాబట్టి తాము ప్రచారం చేస్తున్నామని.. రచ్చ చేస్తే మాత్రం వైసీపీ కుట్ర బుద్ధి బయటపడినట్లే. పోలీసులు ఈ డీప్ ఫేక్ వీడియో ఎక్కడ క్రియేట్ అయిందో తెలుసుకుని వారి విషయం తేల్చాలి. ఇలాంటివి నిర్లక్ష్యం చేస్తే.. రేపు మరొకరి మీద చేస్తారు. అలాంటి వీడియోలకు హద్దే లేకుండా పోతుంది. వ్యవస్థలో ఉన్న లోపాలను అడ్డం పెట్టుకుని ఇతరుల వ్యక్తిత్వంపై దాడులు చేసి. నీతి లేని తమ నేతలతో సమానం చేయాలనుకుంటారు.ఒక వేళ ఆ వీడియో నిజం అయితే నైతిక కోణంలో టీటీడీ చైర్మన్ ను ప్రశ్నించడానికి సర్వ హక్కులు ఉంటాయి. అందులో అంత అభ్యంతరకరమైనది ఏమీ లేకపోయినా. టీటీడీ చైర్మన్‌గా ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తి నైతిక విలువలు పాటించాల్సి ఉంటుందని ప్రశ్నించవచ్చు.

## కమలం గూటికి కామ్రేడ్లు..

**కోల్ కత్తా, మార్చి 2 (వార్తా వేదిక సూర్య)**

భారత రాజకీయాల్లో సిద్ధాంతపరంగా లెఫ్ట్, రైట్ పార్టీలు కమ్యూనిస్టులు, బీజేపీ. రెండు పార్టీల్లో ఉన్నవారు ఉప్పునిప్పులా ఉంటారు. కానీ విచిత్రం బీజేపీ కమ్యూనిస్టుల క్యాడర్ ను తమలో కలిపేసుకుంటోంది. ఇదేం మాయ అని అందరూ ఆశ్చర్యపోవాల్సి వస్తోంది. ఒకప్పుడు కమ్యూనిస్టులకు కంచుకోటలుగా ఉన్న త్రిపుర, పశ్చిమ బెంగాల్, ప్రస్తుతం కేరళలో బీజేపీ అనూహ్యంగా బలపడటం వెనుక ఒక పక్కా రాజకీయ మాయాజాలం కనిపిస్తోంది. పశ్చిమ బెంగాల్, త్రిపురలలో కమ్యూనిస్టుల పతనం తర్వాత క్షేత్రస్థాయి కేడర్‌కు రక్షణ కరువైన వేళ, అధికార తృణమూల్ కాంగ్రెస్ వంటి శక్తుల దాడులను తట్టుకోవడానికి వారు బలమైన ప్రత్యామ్నాయంగా బీజేపీని ఆశ్రయించారు. కానీ కేరళలో మాత్రం భిన్నమైన వ్యూహాన్ని బీజేపీ అమలు చేస్తోంది.కమ్యూనిస్టుల ఓటు బ్యాంక్ నిరుపేదలు. పోరాటాలు చేస్తారు కానీ ఆ ఫలితాలు వస్తాయో రావో తెలియదు.కానీ మోదీ.. ఆ పోరాటాలు లేకుండానే వారికి కావాల్సినవి సమకూరుస్తున్నారు. అట్టడుగు వర్గాల సంక్షేమం అనే నినాదాలను బీజేపీ తనదైన శైలిలో అందిపుచ్చుకుంది. ప్రధాని మోదీ నాయకత్వంలో అమలు చేస్తున్న ఉచిత బియ్యం, గ్యాస్ కనెక్షన్లు, పక్కా ఇళ్లు వంటి పథకాలు కమ్యూనిస్టుల సంప్రదాయ ఓటు బ్యాంకైన పేదలు, కార్మికులను సూటిగా ఆకర్షించాయి. దీనికి సాంస్కృతిక జాతీయవాదం తోడవడంతో, అంతర్జాతీయవాదం కంటే దేశభక్తి, భద్రత వైపు ప్రజలు మొగ్గు చూపారు. సిద్ధాంతాల కంటే దైనందిన జీవితంలో స్పష్టమైన మార్పును చూపడం ద్వారా బీజేపీ కమ్యూనిస్టుల పునాదులను కదిలించగలిగింది.కేరళలో ఇప్పటికీ సీపీఎం, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోరు సాగుతున్నప్పటికీ, బీజేపీ ఓటు శాతం నిలకడగా పెరుగుతోంది. కమ్యూనిస్టు నేతలు ప్రజలకు దూరమై, గ్రామాల్లో శూన్యం ఏర్పడిన చోట రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శాఖలు సేవా కార్యక్రమాల ద్వారా పాతుకుపోయాయి. గ్రామస్థాయిలో ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, కమ్యూనిస్టుల పనితీరును అధ్యయనం చేసి వారి ఎత్తుగడలనే చిత్తు చేస్తూ ఆరెస్సెస్ కార్యకర్తలు బీజేపీకి మార్గం సుగమం చేస్తున్నారు. ఈ పక్కా ప్రణాళికతోనే కమ్యూనిస్టులను బలహీనం చేస్తూ, వారి కోటల్లోనే బీజేపీ తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. ముందు ముందు కమ్యూనిస్టులు మరింత బలహీనపడటం ఖాయంగా కనిపిస్తోంది.

## వైఎస్ వివేక కేసులో కొత్త ట్విస్ట్

**కడప, మార్చి 2 (వార్తా వేదిక సూర్య) :**

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్య కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ దర్యాప్తు మళ్లీ ఊపందుకుంది. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత అధికారులు విచారణను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో కడప జిల్లా పులివెందుల కేంద్రంగా కీలక వ్యక్తుల విచారణ ప్రక్రియను సీబీఐ బృందం తిరిగి ప్రారంభించింది.ఈ కేసులోప్రధాన నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి బంధువులపై సీబీఐ అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా సునీల్ యాదవ్ సోదరుడు కిరణ్ కుమార్ యాదవ్, అలాగే భరత్ కుమార్ యాదవ్ సోదరుడు మహేంద్ర యాదవ్‌లకు విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. పులివెందుల పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న అధికారుల ఎదుట మహేంద్ర యాదవ్ ఇప్పటికే విచారణకు హాజరుకాగా.. కిరణ్ కుమార్ యాదవ్ విచారణకు రానున్నట్లు సమాచారం.ప్రస్తుత విచారణలో ( అత్యంత కీలకమైన అంశం కిరణ్ యాదవ్, అర్జున్ రెడ్డిల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలే. సుప్రీంకోర్టు సూచనల మేరకు వీరిద్దరి కాల్ డేటాపై సీబీఐ లోతుగా దర్యాప్తు చేస్తోంది. వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజు రాత్రి అనగా.. తెల్లవారుజాము న సరిగ్గా 1:42 గంటల సమయంలో కిరణ్ యాదవ్ నుంచి అర్జున్ రెడ్డికి ఒక వాట్సాప్ కాల్ వెళ్లినట్లు దర్యాప్తులో వెలుగుచూసింది.హత్య జరిగిన సమయానికి అత్యంత చేరువలో, పైగా అర్ధరాత్రిపూట ఈ కాల్ వెళ్లడం దర్యాప్తు అధికారుల అనుమానాలకు బలం చేకూరుస్తోంది. ఆ సమయంలో వీరిద్దరి మధ్య అసలు ఏం చర్చ జరిగింది? వివేకా హత్యకు, ఈ కాల్‌కు ఉన్న లింక్ ఏంటి? అన్న కోణంలో అధికారులు కూపీ లాగుతున్నారు. కాగా, ఈ ఫోన్ కాల్ వ్యవహారంపైనే ఈ నెల 20వ తేదీన హైదరాబాద్‌లో సైతం వీరిద్దరి నీ సీబీఐ అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. తాజా పులివెందుల విచారణతో ఈ కేసు దర్యాప్తు ఏ మలుపు తిరుగుతుందోనన్న ఉత్కంఠ స్థానికంగా నెలకొంది

### టీడీపీ కొత్త అధ్యక్షుడిగా కొల్లు..?

**విజయవాడ, మార్చి 2 (వార్తా వేదిక సూర్య) :**

రాష్ట్రంలో రకరకాల రాజకీయ ప్రచారాలు జరుగుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు సమీపిస్తోంది. దీంతో మంత్రివర్గంలో చేర్పు మార్పులు ఉంటాయని ప్రచారం నడుస్తోంది. అయితే ఎవరిని మంత్రి పదవుల నుంచి తీస్తారో? కొత్తగా ఎవరికి ఇస్తారో? అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే టిడిపి రాష్ట్ర అధ్యక్ష పదవి మార్పు ఉంటుందన్న ప్రచారం మాత్రం నడుస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడిగా ఉన్న పల్లా శ్రీనివాసును మంత్రివర్గం లోకి తీసుకుంటారని తెలుస్తోంది. అదే జరిగితే రాష్ట్ర అధ్యక్ష పదవి ఎవరికి ఇస్తారు అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. అయితే ఆది నుంచి టిడిపి రాష్ట్ర అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. అందుకే బీసీ నేతకు తప్పకుండా ఆ పదవి కేటాయిస్తారని తెలుస్తోంది. ప్రముఖంగా ఓ మంత్రి పేరు వినిపిస్తోంది.2014లో రాష్ట్ర విభజన జరిగింది. దీంతో తెలుగు దేశం పార్టీని జాతీయ పార్టీగా ప్రకటించారు చంద్రబాబు. ఏపీతోపాటు తెలంగాణకు వేర్వేరుగా రాష్ట్ర అధ్యక్ష పదవులను కేటాయించారు. జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు కొనసాగుతుండగా రెండు రాష్ట్రాల్లో పార్టీలకు మాత్రం వేర్వేరు అధ్యక్షులను నియమిస్తూ వచ్చారు. చంద్రబాబుతో పాటు లోకేష్ కు అత్యంత విధేయుడు రవీంద్ర. తొలిసారిగా మచిలీపట్నం నుంచి 2009లో పోటీ చేసి ఓడిపోయారు. 2014లో రెండోసారి పోటీ చేసి గెలిచారు. చంద్రబాబు క్యాబినెట్లో ఐదేళ్లపాటు మంత్రిగా కొనసాగారు. 2019లో ఓటమి ఎదురైంది. 2024 లో మాత్రం విజయం సాధించి రెండోసారి మంత్రి పదవి చేపట్టారు. అయితే ఇప్పుడు విస్తరణలో భాగంగా ఆయనను మంత్రివర్గం నుంచి తొలగించి టిడిపి రాష్ట్ర అధ్యక్ష పదవి బాధ్యతలు ఇస్తారని తెలుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# తల్లిదండ్రులను పట్టించుకోని తనయులు

## ❖ ఆదరించి ఆశ్రమంలో చేర్పించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

(యాదాద్రి భువనగిరి బ్యూరో ) మార్చి 2 వార్త వేదిక సూర్య : యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనురాగ్ జయంతి సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కన్న కొడుకులు నిర్లక్ష్యంతో తల్లిదండ్రుల బాగోగులు పట్టించు కోక పోవడంతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కి వృద్ధ దంపతులు మొరపెట్టుకున్నారు. మానవతా హృదయంతో చలించిపోయిన కలెక్టర్ ఆ వృద్ధ దంపతులను ఆదరించి , వయోవృద్ధుల ఆశ్రమం లో చేర్పించారు.



వివరాల్లోకి వెళితే ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన ధర్మ సోమిరెడ్డి రమణమ్మ దంప తులకు ఇద్దరు కుమారులు. తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తిని పంచుకొని, వారిని నిర్లక్ష్యం చేయడంతో గత సంవత్సరం డిసెంబర్ నెలలో జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేశారు. మరుసటి రోజే భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి గ్రామానికి విచారణకు వెళ్ళి, పూర్తి వివరాలు సేకరించారు. వృద్ధ దంపతుల కుమారులైన ధర్మ వెంకట నరసింహ రెడ్డి, ధర్మ గోవర్ధన్ రెడ్డి లను పలుమార్లు ఆర్డీఓ కార్యాలయం లో కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం భువనగిరి ఆర్డీవో, సీనియర్ సిటిజన్ యాక్ట్ 2007 ప్రకారం సబ్ డివిజన్ ట్రిబ్యునల్, వెల్ఫేర్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్, రాజస్వ మండలాధికారి భువనగిరి గారి ఉత్తర్వు 2647/2025, తేదీ 27-01-2026 నాడు జడ్జిమెంట్ ఆర్డర్ పంపించారు. అయినా ఆ కుమారులు మారలేదు, ఆర్డీఓ ఆర్డర్ ను బేఖాతరు చేసారు. దిక్కుతోచని ఆ వృద్ధ దంపతులు అప్పిలేట్ అధికారి అయిన జిల్లా కలెక్టర్ ను సోమవారం ప్రజావాణి లో కలిసి మొరపెట్టుకున్నారు. మాకు ఎవరూ లేరు. మాకు మీరే దిక్కు, మమ్మల్ని అనాధాశ్రమం లో చేర్పించండి అంటూ ప్రాధేయపడ్డాడు. దీంతో జిల్లా



కలెక్టర్ అనురాగ్ జయంతి ఆ వృద్ధ దంపతులకు అండగా నిలిచారు. చౌటుప్పల్ మండలం పెద్ద కొండూరు లోని వయోవృద్ధుల ఆశ్రమంలో చేర్పించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో తల్లిదండ్రుల బాగోగులు చూడకుండా నిర్లక్ష్యం చేసే కొడుకులకు ఈ సంఘటన కనువిప్పు కలుగాలని ఆశిద్దాం.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

భువనగిరి మార్చి 2/వార్త వేధిక సూర్య :– యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ 10వ తరగతి వి ద్యార్థులకు వీడ్కోలు సమావేశం అత్యంత ఉత్సాహభరితంగా మరియు భావోద్వేగపూర్ణంగా నిర్వహించబడింది. పాఠశాల ప్రిన్సిపాల్ రఘు అఖిల మాట్లాడుతూ దశాబ్దాలుగా అందిస్తున్న నాణ్యమైన విద్య ఫలితంగా తమ పాఠశాలలో చదివిన ఎందరో విద్యార్థులు ఐ ఐ టీ,నీట్ , ఎంసెట్ సహా అనేక ప్రభుత్వ పోటీ పరీక్షల్లో విజయం సాధించారని వెల్లడించారు. ఇంత నాణ్యమైన విద్యను అందించడానికి ఏ రకమైన అదనపు ఫీజు వసూలు చేయలేదని స్పష్టంగా పేర్కొన్నారు. ఆకర్షణీయమైన కోర్సుల పేర్లతో విద్యా ర్థులను తప్పుదోవ పట్టించే వ్యాపార సంస్థల పట్ల జాగ్రత్తగా ఉండాలని తల్లిదండ్రులకు గట్టిగా సూచించారు. పాఠశాల డైరెక్టర్ దీపక్ కుమార్ రఘు 10వ తరగతి విద్యార్థులను ఉద్దేశించి చేసిన ప్రసంగం కార్యక్రమంలో అత్యంత ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. డా. ఏపీజే అబ్దుల్







కలాం జీవితంలోని కీలక అంశాలను ప్రస్తావిస్తూ సాగిన ఆ స్ఫూర్తిదాయకమైన ప్రసంగం విద్యార్థులను, ఉపాధ్యాయులను సమానంగా ప్రేరేపించింది. ఈ సంవత్సరానికి గాను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ఫిజిక్స్ టీచర్ శ్రీనివాసులు కి మరియు బయాలజీ టీచర్ సంతోష్ కి అందిం చబడ్డాయి. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాలతో తమకు ఉన్న అనుబంధాన్ని మరియు తమ అమూల్యమైన అనుభవాలను హృదయపూర్వకంగా పంచుకున్నారు. చదువు కావాలి అంటే ఏ సంస్థలో అయినా దొరుకుతుంది కానీ విలువలతో కూడిన విజ్ఞానాన్ని ఈ పాఠశాలలో నేర్చుకున్నామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# లియాఫీ తరపున ఏజెంట్ మిత్రులకు 25 వేల ఆర్థిక భద్రత

## ❖ అధ్యక్షులు కరకాల సుదర్శన్‌లి

(యాదాద్రి భువనగిరి బ్యూరో)మార్చి 2 వార్త వేదిక సూర్య :ఎండనక వాననక అనునిత్యం ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించడం కోసం అహర్నిశలు ఎల్ఐసి ఏజెంట్లు కష్టపడుతున్నారని సికింద్రాబాద్ డివిజన్ లియాపి అధ్యక్షులు పోతుల రామస్వామి, ప్రధాన కార్యదర్శి ధోతినేని సునీల్ కుమారులు తెలిపారు. భువనగిరి శాఖ ఏజెంట్ల సభ్యత్వాల కార్యక్రమం సోమవారం నాడు డివిజన్ బ్రాంచ్ అధ్యక్షులు కరకాల సుదర్శన్ అధ్యక్షతన జరిగింది. కష్టపడుతున్న ఏజెంట్ సోదరీ సోదరీమణుల కోసం లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎల్ ఐ ఏ ఎఫ్ ఐ-1964 తరపున సభ్యత్వం తీసుకున్న ఏజెంట్లు అకాల మరణం చెందినట్లయితే వారి కుటుంబానికి 25 వేల ఆర్థిక సహాయం ఇవ్వనున్నట్లుగా యూనియన్ నాయకులు ప్రకటించారు. లిభువనగిరి శాఖకు సంబంధించిన ఏజెంట్ల యొక్క సభ్యత్వాలు 124 ఏజెంట్ మిత్రుల సభ్యత్వాలు డివిజన్ నాయకులకు బ్రాంచ్ అధ్యక్షులు సుదర్శన్ అందజేశారు. ఏజెంట్ల యొక్క ప్రతి సమస్య కోసం ఏజెంట్లకు రావాల్సిన హక్కుల కోసం లియాఫీ 1964 అనునిత్యం పోరాటం చేస్తుందన్నారు. ఏజెంట్ల కుటుంబాలకు 25వేల ఆర్థిక భద్రత కల్పించడం సంతోషంగా ఉందన్నారు. లిఈ సమావేశంలో డివిజన్



నాయకులతో పాటు బ్రాంచ్ సెక్రటరీ గుగులోత్ వెంకన్న, జోనల్ నాయకులు అన్నం వీరారెడ్డి, డివిజన్ నాయకులు అబ్బగాని వెంకట్, ఎదునూరి మల్లేశం, పెంట చంద్రమౌళి, బొక్క రాంబాయి, మోత్కూరు



అధ్యక్షులు బిక్షం రెడ్డి, కోశాధికారి బుర్ర యాదగిరి, రాంపల్లి వెంకటయ్య, నమిలి రామచందర్, ఆకుల ఆంజనేయులు, పాదం వాసుదేవ్, మంత్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత తీసుకోవాలి

## • తహశీల్దార్ జ్యోతి

మోత్కూరు, మార్చి 02 ( వార్త వేదిక సూర్య): బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత తీసుకోవాలని తహశీల్దార్ పి.జ్యోతి అన్నారు. యాక్సెస్ టు జస్టిస్ వారి సౌజన్యంతో స్కోప్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రచార జాత సోమవారం మోత్కూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ బడి, ఈడు పిల్లలు బడిలోనే చదవాలని, బాల్య వివాహాలు ఎక్కడ జరిగిన, సమాచారం తెలిసిన తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సిడిపిఓ యామిని మాట్లాడుతూ అంగన్ వాడి స్థాయి నుంచి, బడి ఈడు పిల్లలు బడిలోనే డ్రాప్ ఔట్ కాకుండా ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు., 18 ఏళ్ల లోపు పిల్లలకు వివాహాలు చేస్తే ఆయా తల్లిదండ్రులపై కేసులు నమోదు అవుతాయని తద్వారా ఆ కుటుంబాలు చిన్న బిన్నం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. మోత్కూరు సి.ఐ. సి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలకు వివాహాలు జరిగితే ఆడపిల్లల శరీర ఎదుగుదలకు భవిష్యత్.లో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు ఎక్కువ ఉంటాయని పేర్కొన్నారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగిన, తెలిసిన 1098,112,100 ఉచితంగా కాల్ చేసి చెప్పాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవింద రాయుడు అధ్యక్షతన వహించారు. ఈ కార్యక్రమంలో స్కోప్ స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ కురిమేటి యాదయ్య, సి. డబ్ల్యూ.సి. సభ్యులు కునగళ్ల మల్లేశం,లీడ్ ఎన్జీవో కానుగంటి శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.





## కలెక్టర్‌ను కలిసిన జనార్దన్ రెడ్డి



మోత్కూరు, మార్చి 02 (వార్త వేదిక సూర్య): యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్ బాధ్యతలు స్వీకరించిన అనురాగ్ జయంతి ని సోమవారం మండల పంచాయతీ అధికారుల సంఘం (ఎంపీఓ) పక్షాన మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పైళ్ళ జనార్ధన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా నాయకులు చంద్రశేఖర్, దినకర్, సలీం, శ్రీలత, కేదారీశ్వర్, పోలేశ్వర రాజు తదితరులు పాల్గొన్నారు.

## కరాటే పోటీలో పతకాలు సాధించిన అక్షర విద్యార్థులు




దంతాలపల్లి, మార్చి 02 (వార్త వేదిక సూర్య) :మేడారంలో జరిగిన 8 వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలోని స్థానిక అక్షర హై స్కూల్ విద్యార్థులు పాల్గొని అండర్ 12 ఇయర్స్ బ్రౌన్ బెల్ట్ విభాగంలో చిల్ల భార్గవి రజత పథకం సాధించారు. అండర్ 11 ఇయర్స్ ఎల్లో బెల్ట్ విభాగంలో ఎస్.కె సమరీన్ కాంస్య పథకం సాధించడం జరిగింది. బాలుర అండర్ 11 ఇయర్స్ విభాగంలో రిశ్విక్ రెడ్డి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ ,ప్రిన్సిపాల్ సింగారపు యాకయ్య, వైస్ ప్రిన్సిపాల్ తిరునగరి శ్రీధర్, పాఠశాల కోఆర్డినేటర్ సింగారపు భవాని, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సుకన్య, పద్మ, సంధ్య, శిరీష, అశోక్, కరాటే కోచ్ రాజ్ కుమార్, మరియు వ్యాయామ ఉపాధ్యాయులు అనిల్, అరుణ అభినందించారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



మోత్కూరు, మార్చి 02 (వార్తా వేదిక సూర్య): మండలంలోని పాటిమట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ గా చల్ల పల్లవి, డీఈఓ గా కొమ్మ మనీషా, డిప్యూటీ డిఈఓ గా పర్వతగిరి గ్రీష్మ , ఎమ్మెల్యేగా కురుమేటి శివ సాయి, ప్రధానోపాధ్యాయులుగా మొగులగాని మానస, ఉపాధ్యాయులుగా విద్యార్థులు తమ పాత్రలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిర్యాల దామోదర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతోనే ఉన్నత లక్షణం అలవార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కాముల లింగమల్లు, బండారు మల్లయ్య, దర్శనం వెంకన్న ,వంగూరి యాదయ్య, చిరుమర్తి యాదయ్య, కె.కవిత, డి తిరుపతి, కే కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సిసి రోడ్లు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ దుబ్బ సోనియా దర్శన్ వైస్ చైర్మన్ గరుగు రాజు ముదిరాజ్



మొయినాబాద్ మున్సిపాలిటీ మార్చి 02 (వార్తా వేదిక సూర్య): మొయినాబాద్ మున్సిపాలిటీ చిలుకూరు 1వార్డులో డ్రైనేజీ మరియు సిసి రోడ్లు పనులను ప్రారంభించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మొయినాబాద్ మున్సిపాలిటీ చైర్మన్ దుబ్బ సోనియా దర్శన్, వైస్ చైర్మన్ గరుగు రుగు రాజు ముదిరాజ్, వార్డ్ కౌన్సిలర్లు చదువు శ్రీలత రాం చందర్ ముదిరాజ్, గునుగుర్తి శిరీష కిరణ్ , గౌర యాదగిరి, మున్సిపల్ అధికారులు అదేవిధంగా చిలుకూరు గ్రామస్తులు మాజీ ఉప సర్పంచ్ సుధాకర్ రెడ్డి, మాజీ వార్డ్ మెంబర్లుగ్రామస్తులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలో 9 మంది గౌర్హాజరు



మోత్కూరు, మార్చి 02 ( వార్తా వేదిక సూర్య ): ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలో జనరల్ గ్రూపు లో 417 మందికి 413 మంది, ఒకేషనల్ 129 మందికి 124 మంది హాజరయ్యారని మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం సూపరిం డెంట్ పి విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ రాధిక, తహశీల్దార్ పి.జ్యోతి, డిప్యూటీ తహశీ ల్దార్ వెంకటేశ్వర రెడ్డి తనిఖీ చేశారు.

